తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం వార్షికోత్సవం 1996 - 2026

# చిరుత కలకలం

## తిరుపతి యూనివర్సిటీలో బోనుకు చిక్కిన పులి



తిరుపతి విద్య, మే 25 ప్రభాతవార్త

తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలోకి ప్రవేశించిన చిరుత పులిని అటవీశాఖ అధికారులు సురక్షితంగా బంధించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అటవీశాఖ చేపట్టిన హెచ్.ఏ.ఎన్.యూ.ఎం.ఏ.ఎన్ కార్యక్రమం కింద ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. సోమవారం ఉదయం సుమారు 8.57 గంటలకు విశ్వవిద్యాలయంలోని క్లినికల్ సైన్సెస్ విభాగ భవనంలోని మరుగుదొడ్డిలో చిరుత ప్రవేశించినట్లు యూనివర్సిటీ ప్రిన్సిపాల్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అటవీశాఖ అధికారులు, వన్యప్రాణి నిపుణులు, వేగవంతమైన స్పందన మరియు రక్షణ బృందాలు ఘటన స్థలానికి చేరుకున్నాయి. అనంతరం రవాణా బోనును ఏర్పాటు చేసి ప్రత్యేక బృందాల సమన్వయంతో రెస్క్యూ చర్యలు చేపట్టారు. తిరుపతి ప్రధాన అటవీ సంరక్షణాధికారి వై. శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో, ఎస్వీ జూ క్యూరేటర్ అనురాగ్ మీనా, వెటర్నరీ వైద్య నిపుణులు, జూ అధికారులు, రక్షణ బృందాలు కలిసి ఆపరేషన్‌ను నిర్వహించాయి. ఉదయం 11.25 గంటలకు చిరుతను విజయవంతంగా బంధించి, 11.29 గంటలకు ప్రత్యేక వాహనంలో తరలించారు.

### అభివృద్ధి కార్యక్రమాలపై

# శాఖల వారీగా సమీక్ష

## జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, మే 25 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదించిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో ప్రతిపాదించిన అభివృద్ధి కార్యక్రమాలపై వర్చువల్ విధానంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం సంబంధిత శాఖ అధికారులతో జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరైన రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని సూచించారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్, తుడా పరిధిలో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. నగర అభివృద్ధికి అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు తదితర సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు సమయానికి అందేలా చర్యలు చేపట్టాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. రేషన్ పంపిణీలో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా పర్యవేక్షణ పెంచాలని సూచించారు. సమావేశంలో ఇంచార్జి మునిసిపల్ కమీషనర్ శారదా దేవి, పంచాయతీ అధికారి సుశీలా దేవి, తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, ఏపీఐఐసీ జోన్ మేనేజర్ విజయ భరత్ రెడ్డి, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, ఎస్ ఈ ఆర్ అండ్ బి రాజా నాయక్, సివిల్ సప్లై అధికారి రాజు, ఇరిగేషన్ డి ఈ, రాధా కృష్ణా , గనుల శాఖ అధికారి బాలాజీ నాయక్, ఉద్యాన శాఖ అధికారి శివకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు. సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పారిశ్రామిక ఆవిష్కరణలతో

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

## సిఎం చంద్రబాబునాయుడు
## వర్చువల్ విధానంలో రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్ ప్రారంభం!!



వర్చువల్ విధానంలో రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

కుప్పం, మే 25 ప్రభాతవార్త

సాంకేతిక ఆధారిత, పారిశ్రామిక ఆవిష్కరణలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చెందుతుందని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సోమవారం అమరావతి నుంచి వర్చువల్ విధానంలో కుప్పం మండలం వెండుగంపల్లి, మంగళగిరి, పిఠాపురంలలో టాటా ఇన్నోవేషన్ హబ్ వారి సహకారంతో రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్లను సిఎం చంద్రబాబు ప్రారంభించారు. కుప్పం నుంచి ఈ కార్యక్రమంకు వర్చువల్‌లో ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ)లకు 558కోట్ల మేర ప్రోత్సాహకాలు అందించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20లక్షల ఎంఎస్‌ఎంఇలు ఉన్నాయన్నారు. ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమంలో భాగంగా భవిష్యత్తులో రాష్ట్రంలో కోటి ఎంఎస్‌ఎంఇలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (తిరుపతి) హెడ్ డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కుప్పం ప్రాంతంలో యువత, మహిళలు, నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దేలా ఈ కేంద్రం పనిచేస్తుందన్నారు. కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కడ సభ్యుడు రామచంద్ర, కార్పోరేషన్ డైరెక్టర్ పార్థసారథి, కాణిపాకం బోర్డు సభ్యులు వసంతమ్మ, నరేష్, పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# టిటిడి జెఈఓ వీరబ్రహ్మాం బదలీ

## -సిసిఎల్ఎ సంయుక్తకార్యదర్శిగా పోస్టింగ్



తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడిలో సంయుక్తకార్యనిర్వహణాధికారిగా(జెఈఓ)గా పనిచేస్తున్న వి,వీరబ్రహ్మాయ్య ఎట్టకేలకు బదిలీ అయ్యారు. ఆయనను ప్రభుత్వం దేవాదాయశాఖ నుండి బదలీ చేసి మంగళగిరిలోని సిసిఎల్ఎ విభాగంలో సంయుక్తకార్యదర్శిగా నియమించింది. సోమవారం సాయంత్రం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. 2021 సెప్టెంబర్‌లో టిటిడికి జెఈఓగా వచ్చిన ఆయన అప్పట్లో కీలకంగా కొన్ని విభాగాలపై పట్టుసాధించారు. అప్పటి ప్రభుత్వంలోని టిటిడి బోర్డు పెద్దలతో కలసి తిరిగి వాళ్ళు చెప్పిందే వేదంగా పనిచేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. 2025 మేలో ప్రభుత్వం మారి టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జెఇఒ వీరబ్రహ్మాయ్య బదలీ అవుతారని భావించారు. ఏకంగా ఆయన వైసిపికి విధేయుడుగా కూడా సేవలందిస్తున్నాడనేది పెద్ద విమర్శలు. అయితే ప్రభుత్వం టిటిడిలో సమర్థవంతమైన అధికారుల అవసరాన్ని గుర్తించి వీరబ్రహ్మాం సేవలను రెండేళ్ళు అలాగే కొనసాగించింది. దాదాపుఐదేళ్లపాటు టిటిడి జెఇఒగా వీరబ్రహ్మాయ్య సేవలందించడం విశేషం. ఆయన స్థానంలో మరెవరినీ నియమించలేదు.

### ముత్యపుపందిరిపై

# గోవిందరాజులు కటాక్షం



తిరుపతి,మే 25ప్రభాతవార్త:

తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ముత్యపుపందిరి వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చి అభయానుగ్రహాలు ప్రసాదించారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వాహనసేవలో గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాలు, వేదఘోషల నడుమ తిరుపతి మాడవీధులు భక్తిరసంతో పరవశించాయి. జ్యోతిషశాస్త్రంలో చంద్రునికి ప్రతీకగా భావించే ముత్యం చల్లదనానికి, శాంతికి సంకేతం. సముద్రగర్భం ప్రసాదించిన అమూల్య రత్నాలైన ముత్యాల కాంతుల మధ్య నిలిచిన శ్రీహరి దర్శనం భక్తుల తాపత్రయాలను తొలగించి, జీవితాల్లో ప్రశాంతతను, సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందనే విశ్వాసం భక్తుల్లో వెల్లివిరిసింది. ఉదయం గోవిందరాజస్వామి సింహవాహనంపై అభయహస్తంతో భక్తులను అనుగ్రహించారు. ఉదయం 7 నుండి 9 గంటల వరకు జరిగిన ఈ దివ్య వాహనసేవలో అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ వాహనసేవలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టిటిడి డిప్యూటీ ఈఓ వి.ఆర్. శాంతి, ఏఈఓ ఏబీ నారాయణ చౌదరి, ఏవీఎస్ఓ ఆర్. శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు శేషగిరి, చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయరావు, రంజిత్, ,అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# సంతృప్తి స్థాయి పెంచేలా అర్జీలు పరిష్కారం

## కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, మే 25 ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను సంతృప్తి స్థాయి పెంచేలా నిర్ణీత గడువులోపు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టరర్లు కృష్ణనాయక్, కుసుమకుమారిలు, ఎఓ వాసుదేవన్‌లు హాజరై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారాలను వేగంగా అందించాలన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుండి వున్న ప్రజల నుండి సమస్యలపై 116 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ, సర్వే శాఖలకు సంబంధించి 95 అర్జీలు అందగా, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ 15, పోలీసుశాఖ 2, మున్సిపల్ కమీషనర్ 2, పంచాయతీరాజ్, ఎంపిడిఓ కార్యాలయాలకు సంబంధించి ఒకొక్క అర్జీ అందాయి.



ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 423 అర్జీలు..

## :జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు..



తిరుపతి కలెక్టరేట్, మే 25 ప్రభాతవార్త:..

పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో డి.ఆర్.ఓ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిరక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీజిఆర్ఎస్ లో వచ్చు అర్జీలపై నిరక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిఆర్ ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు శివశంకర్ నాయక్, భరత్ నాయక్, రోజ్ మాండ్ లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు. సంబంధిత అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్

# మామిడి రైతుకు గిట్టుబాటు ధర

## - కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించిన ఎపి రైతు సంఘం నేతలు

చిత్తూరు, మే 25 ప్రభాతవార్త:

జిల్లాలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, నష్టాల నుండి ఆదుకోవడానికి ముందస్తు కొనుగోలు చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం ఎపి రైతు సంఘం నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించారు. చిత్తూరు జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల్లో వేలాది రైతులకు మామిడి సాగు ప్రధాన జీవనాధారం అని, ఈ ఏడాది మార్కెట్‌లో ధరలు దారుణంగా పడిపోవడం, ఉత్పత్తి వ్యయం భారీగా పెరగడంతో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ఏడాది మామిడి రైతుల దీన స్థితిని గుర్తించిన ప్రభుత్వం కేజీకి రూ.4 చొప్పున రైతుకు ఆర్థిక సహాయం అందించిందని, అలాగే ఈ ఏడాది సైతం ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి గుజ్జు పరిశ్రమలను సమన్వయం చేసుకుంటూ రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సీజన్‌లో తోతాపురి మామిడికి టన్నుకు కనీస మద్దతు ధర రూ.18 వేలుగా నిర్ణయించాలని, బేనిషా, బంగినపల్లి కాయల నాణ్యతను బట్టి టన్ను ధర కనీసం రూ.25 వేలు వుండేలా చ్యలఉ తీసుకోవాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసిన ఎపి రైతు సంఘ నాయకుల్లో ఎ.రామానాయుడు, జి.మునిరత్నం, కె.మునిరత్నం, శివారెడ్డి తదితరులు వున్నారు.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత...

## కమిషనర్ శారదా దేవి...



తిరుపతి కార్పొరేషన్, మే 25 ప్రభాతవార్త:

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా సోమవారం ఉదయం నగరంలోని గోదాదేవి మార్గం, గాంధీ భవన్, మంచినీళ్ళ కుంట తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ జూన్ 22 వరకు నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కో వారం ఒక్కో అంశంతో పారిశుద్య పనులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మన ఇల్లే కాకుండా పరిసరాలతో పాటు నగరాన్ని శుభ్రంగా ఉంచుకునేందుకు అందరూ కంకణబద్దులు కావాలని అన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

### చిట్టత్తూరు చెరువును...

# అక్రమంగా దున్నేస్తున్నారు

## -గ్రామ ప్రజల ఫిర్యాదు లేదంటున్న తహాశీల్దార్



తొట్టంబేడు మే 25 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలంలోని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఆక్రమణలకు సంబంధించి రెవెన్యూ అధికారులు తమకు ఫిర్యాదులే అందలేదంటూ దాటవేస్తుండగా అక్రమణ దారులు చెరువులను కూడా వదలిపెట్టక చెరబడుతున్నారు. మండల అధికారుల మాయాజాలం మామూళ్ల మత్తుకు అలవాటైన కాలం ... ఖాళీ కనబడితే చాలు ఏదో ఒక రాజకీయ నాయకుని పేరు చెప్పి పాగా వేస్తున్నారు. చివరకు చెరువులను కూడా చెరబడుతున్నారు. గతంలో ట్రెంచ్‌లు తవ్వి నిషేధితమని ప్రకటించిన చెరువులో నేడు దర్జాగా వ్యవసాయం సాగుతుంది. చిట్టత్తూరు రెవెన్యూ లెక్కల దాఖలా, సర్వేనెంబర్ 41,42, చిన్న చెరువు పెద్ద చెరువులు కలవు ఈ చెరువు కు తెలుగు గంగ కాలవ ఆనుకొని ఉండడం వలన ఈ చెరువులలో ఎప్పుడు నీళ్లు ఉండడం గమనించిన కబ్జాదారులు చెరువును ఆక్రమించుకుంటూ సాగు చేస్తున్నారుమా చెరువు ని కాపాడండి.. అని గత ప్రభుత్వం హయాంలో ఒక దినపత్రిక (వార్త) ప్రచురితం చేయటంతో అప్పటి అధికారులు వెంటనే స్పందించి, చెరువు భూములు ఎవరు దిగరాదని జెసిబి ని పెట్టి పెద్ద కాలవ తీయడం జరిగినది. అయితే ఎవరి మద్దతో ఏమో కానీ ఓ ప్రభుత్వ ఉద్యోగి వారి కుటుంబసభ్యులు అనుచరులు కబ్జాదారులుగా మారి తమ ప్రతాపంతో చెరువు లోతట్టు మళ్ళీ వ్యవసాయం మొదలెట్టారు. చెరువునే మింగేస్తే చెరువు కింద ఉన్న వ్యవసాయం మాటేమిటనే విమర్శలు చోటు చేసుకున్నాయి. చెరువు లోతట్టు ఆరుగురు కలిసి సుమారు 25 ఎకరాలు చెరువును ఆక్రమించుకొని పంటలు పండించే వారు ఇది తప్పు అని గత ప్రభుత్వంలో చిట్టత్తూరు గ్రామ ప్రజలు అప్పటి అధికారులకు తెలియజేయగా, వెంటనే స్పందించిన అధికారులు జెసిబి లను పెట్టి చిట్టతూరు చెరువు భూమిని సర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేసి పెద్ద కాలవ తీయడం జరిగినది. అప్పటినుండి ఆ భూముల్లోకి ఎవరు దిగకుండా ఉన్నారు. అధికారం మారింది ఆయకట్టు దారుడు మారాడు మళ్లీ మొదట కొచ్చిన భూ కబ్జా వ్యవహారం ఆయకట్టదారుడే అందరినీ ఉసిగొలిపి చెరువును దున్నేయండి అని సలహా ఇచ్చి చెరువును దున్నేశారు అనే గుస గుసలు వినబడుతున్నాయి.

### మాకు ఫిర్యాదే అందలేదు: తహాశీల్దార్

చిట్టత్తూరు చెరువు లోతట్టు ఆక్రమణలకు సంబంధించి ప్రభాతవార్త సోమవారం తహాశీల్దార్ భారతిని వివరణ కోరగా అలాగా మాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదే. అంటూ సమాధానం చెప్పారు. ఈ సమస్య కు సంబంధించి తనకు తెలియదని చెప్పటం హాస్యాస్పదం. కాగా ఈ ప్రాంత సర్వేయర్‌ను వివరణ కోరగా గతంలో ఫిర్యాదులు అందగా తాము ఇక్కడ బోర్డులు పెట్టామని అ లాగే ట్రెంచ్ తవ్వాని వివరించారు. అయితే ఈ ప్రాంతానికి చెందిన విఆర్ఓ చెరువు ఆక్రమణలకు గురై నార్లు పోసుకొని నాట్లు వేసుకునే వరకు పట్టించుకోలేదంటే రెవెన్యూ పని తీరుకు అద్దం పడుతుందని చెప్పవచ్చు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

## - ఎమ్మెల్యే గురజాల



గుడిపాల, మే 25 ప్రభాతవార్త:

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విధులు నిర్వర్తించి మండలంను అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఏదైనా సమస్యలు వుంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, ఖరీఫ్ సీజన్‌లో వేరుసెనగ విత్తనాలను రైతులకు పక్కాగా అందించడానికి చర్యలు తీసకోవాలన్నారు. ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి మాట్లాడుతూ మండల కేంద్రంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, గుడిపాల పిహెచ్‌సిని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, ప్రజల సౌకర్యార్థం మండలం కేంద్రంలో బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని, మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు ఇంటి పట్టాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడును కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ శిరీష, తహసిల్దారు శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ, సింగిల్‌విండో చైర్మన్ ప్రతాప్‌నాయుడు, అధికారులు, ఎంపిటిసీ సభ్యులు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం.

## నిరాశ్రయులతో మై భారత్ వాలంటీర్లు



చిత్తూరురూరల్, మే 25 ప్రభాతవార్త:

చిత్తూరుపట్టణం, మెప్మా నగరపాలక సంస్థ ఆద్వర్యంలో సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల వసతి కేంద్రాన్ని మై భారత్ వాలంటీర్లు సోమవారం సందర్శించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న మై భారత్ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు వసతిగృహంలోని వృద్ధులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి అనుభవాలు జీవన విలువలు తెలుసుకొన్నారు. వృద్ధుల జీవిత అనుభవాలు యువతకు ప్రేరణనిచ్చేలా వుండడంతో వారితో సమయం గడపడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకౌంట్స్ అధికారి బాబురెడ్డి, సపోర్టు సంస్థ వ్యవస్థాపకులు జోసప్‌రాజు, హైభారత్ సిబ్బంది రాజ్‌కుమారి, వాలంటీర్లు హరీష్‌బాబు, గిరీష్, దినేష్, సాయి దుర్గ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## పండగవాతావరణంలో మహానాడు



రామకుప్పం, మే 25 ప్రభాతవార్త

ఈనెల 27,28 తేదీల్లో తెదేపా మహానాడు కార్యక్రమంను మండలంలో ప ండగ వాతావరణంలో జరుపుకోవాలని నేతలు మునస్వామి, వెంకటరమణ, ఆనందరెడ్డి కోరారు. సోమవారం స్థానిక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నిర్వహించే మహానాడు కార్యక్రమం ఈసారి వర్చువల్ విధానంలో జరుగుతుందన్నారు. స్థానిక కళ్యాణ మండపంలో ఎల్ఇడి స్క్రీన్లను ఏర్పాటు చేయడంతో పాటు కార్యకర్తలకు వసతులు కల్పించడం జరుగుతు ందన్నారు. నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో రావాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పట్రనారాయణ, కామరాజునాయక్, సీతాపతి, రామూర్తి, చిన్నికృష్ణ, కృషా ్ణనాయక్, రామకృష్ణప్ప, విశ్వనాథ్, రఫీ, రవిరెడ్డి, విజయ్‌రెడ్డి, టివి రవి, మంజునాథ్‌రెడ్డి, అవినాష్, బాలరాజు, సుబ్రి, మురళీమోహన్, ఆదిల్, మంజునాథ్, సాగర్‌రెడ్డి, మనోహర్, గజేంద్ర పాల్గొన్నారు.

## విద్యా సంవత్సరం ప్రారంభించ ముందే అడ్మిషన్లు చేస్తున్న కళాశాలలపై చర్యలు

చిత్తూరుహెల్త్, మే 25 ప్రభాతవార్త:

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థుల నుండి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తూ అడ్మిషన్లు ప్రారంభించిన కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా విచ్చలవిడిగా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే అడ్మిషన్లు ప్రారంభించారన్నారు. ఈ కళాశాలల్లో విద్యార్థులకు ఏ మాత్రం మౌలిక వసతులను సైతం యాజమాన్యాలు కల్పించడం లేదని, జిల్లా వ్యాప్తంగా కొని పాఠశాలలు, కళాశాలలకు అనుమతులు లేకపోయినప్పటికీ తరగతులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన వారిలో ఎఐఎస్‌ఎఫ్ నాయకలు ప్రవీణ్‌కుమార్, సంజయ్, లిఖిత్ తదితరులు వున్నారు.


## ముగిసిన ఎన్‌సిసి క్యాడెట్లకు శిక్షణ



చిత్తూరురూరల్, మే 25 ప్రభాతవార్త:

35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్‌వి మోనిష్, కల్నల్ లోకనాథన్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న పదిరోజుల ఎన్‌సిపి విద్యార్థుల శిక్షణా శిబిరం సోమవారం ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక అధికారి కరుణాకర్, ఫైర్‌మెన్స్ జ్యోతీశ్వరరెడ్డి, ధనశేఖర్‌లు ఎన్‌సిసి క్యాడెట్లకు మంటలను ఆర్పడం, తదితర వాటిని వివరించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులను ప్రదానం చేసారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌సిపి ఆఫీసర్లు పికె ప్రసాద్‌రెడ్డి, కార్తీక్, బాలాజీ జయక్రిష్ణ, శ్రీలత, యుగంధర్, హేమంత్ అరుణ్‌పాండియన్, ఆఫీసుసిబ్బంది సంజయ్‌భట్, రమేష్, సురేష్, ఎన్‌వి రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి కోడిగుంట గంగజాతర



చిత్తూరుహెల్త్, మే 25 ప్రభాతవార్త:

చిత్తూరు మురకంబట్టు శివారు ప్రాంతంలోని కోడిగుంట ఇందిరమ్మ కాలనీలో మంగళ, బుధవారాల్లో గంగజాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షులు కోడిగుంట టి.వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు గంగజాతరకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని కమిటీ అధ్యక్షులు తాలుకా ఇన్స్‌పెక్టర్ రామచంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతక కమిటీ అధ్యక్షులు వెంకటేష్ కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడుతూ మంగళవారం ఉదయం గంగమ్మకు తెర తొలగించి జాతర మహోత్సవంను వైభవంగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. అనంతరం రెండు రోజుల పాటు అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకోవచ్చునన్నారు. మహిళలు మంగళవారం ఉదయం పెద్దఎత్తున తరలివచ్చిన గంగమ్మకు అంబళ్ళు సమర్పిస్తారని, అలాగే సాయంత్రం కుంభం సమర్పిస్తారన్నారు. బుధవారం సాయంత్రం అమ్మవారి నిమజ్జనం ఊరేగింపుతో ప్రారంభమై ముగుస్తుందన్నారు. ఈ సమావేశంలో కమిటీ నాయకులు రవిచంద్రారెడ్డి, సంతపేట దైవశిఖామణి, విజయనాయుడు, జ్యోతి, దొడ్డిపల్లి దళవాయి శివకుమార్, జి.నాగరాజ, ఎం.పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

## ఎండలు తీవ్రత తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



పూతలపట్టు, మే 25, ప్రభాతవార్త

ఎండ తీవ్రత నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి పి కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అన్నారు దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందేలా ప్రజలకు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీటి మజ్జిగ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. వడగాలుల నుండి ఎలా రచించుకోవాలి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆశా వర్కర్లు నర్సులుకు సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు గర్భిణీలు చిన్నారులు అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు మరోవైపు ఎండల తీవ్రతలో ఇబ్బందులు పడుతున్న మూగజీవులు పక్షులకు కూడా నీటి తొట్టెలు మట్టికుండలతో నీటిని ఏర్పాటు చేయాలని కోరారు ప్రజలు ప్రాణాలే మనము అత్యంత ప్రాధాన్య ఇవ్వాలని అన్నారు. భూగర్భ జలాలు పెరిగితే పచ్చదనం పెరుగుతుందని తద్వారా తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి కొంత మేర ఉపశమనం లభిస్తుందని అన్నారు.

## అర్ధగిరి హుండీ ద్వారా రూ.11.03 లక్షలు ఆదాయం



తవణంపల్లి, మే 25 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు ద్వారా 11.03 లక్షల రూపాయల ఆదాయం లభించింది. సోమవారం ఆలయంలో చైర్మన్ కె.రఘుపతి, ఇఓ మునిశేఖర్‌ల ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా 68 రోజులకు గాను 11,03,723 రూపాయలు ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారి డి.వెంకటేశ్వర్లు, అరగొండ ఎపి గ్రామీణబ్యాంకు అధికారి బి.కుమార్‌స్వామి నాయుడు, పాలకమండలి సభ్యులు శ్రీధర్‌నాయుడు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యం కోసమే సంజీవని ప్రాజెక్ట్

### - టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్



కుప్పం, మే 25 ప్రభాతవార్త

పేదల ఆరోగ్యం కోసమే సిఎం చంద్రబాబునాయుడు టాటా సంజీవని ప్రాజెక్టు అమలు చేస్తున్నారని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని టి.సదుమూరులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాజెక్టులో ప్రజల ఆరోగ్య వివరాలు డిజిటలైజ్ చేయ బడతాయన్నారు. అత్యవసర వేళల్లో నిపుణులైన వైద్యులచే చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. కుప్పంలోని ఏరియా ఆస్పత్రి, అన్ని పిహెచ్‌సి కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రామచంద్ర, నేతలు విభూషణ్, చంద్ర, మోహన్, చంద్ర, ప్రకాష్, వైద్యాధికారి లత, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ తేజోమూర్తి



అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ ఎం.తేజోమూర్తి
ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన గోవర్ధన్ బాబి

చిత్తూరు, మే 25 ప్రభాతవార్త:

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులుగా విజయం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎం.తేజో మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలెక్టరేట్‌లోని వివేకానంద భవన్‌లోని రెండవ అంతస్తులో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ ఎన్నికల ప్రక్రియను కలెక్టర్ సుమిత్‌కుమార్ నియమించిన సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ ఎన్నికల అధికారిగా, రాష్ట్ర రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ రామచంద్రరాజు ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. ఈ సమావేశంకు హాజరైన రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యుల ద్వారా మేనేజ్మెంట్ కమిటీ సభ్యులను ముందు ఎన్నుకున్నారు. మేనేజ్మెంట్ కమిటీ సభ్యులుగా శ్రీధర్‌రెడ్డి, గోవర్ధన్‌బాబి, ఎం.తేజోమూర్తి, కేశవులునాయుడు, రాజగోపాల్‌నాయుడు, సుధాకర్, ఎంఆర్ అరుణ కుమారి, నంబికరాజ్, రమేష్‌బాబు, డాక్టర్ సి.నిరంజన్‌రెడ్డి, మురుగేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా రెడ్‌క్రాస్ మేనేజ్మెంట్ కమిటీకి ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన 11 మంది సభ్యులు కలిసి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైర్మన్‌గా డాక్టర్ ఎం.తేజోమూర్తి, వైస్ చైర్మన్‌గా కె.గోవర్ధన్‌బాబి, కోశాధికారిగా ఆర్.రాజగోపాల్‌నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెడ్‌క్రాస్ జిల్లా కమిటీకి నూతనంగా ఎన్నికైన కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.తేజోమూర్తి, వైస్ చైర్మన్ కె.గోవర్ధన్‌బాబి, ఇతర కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి మద్దిపట్ల వెంకటరమణ రెడ్‌క్రాస్ కమిటీ ప్రిన్సిపుల్స్‌తో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సర్వసభ్య సమావేశానికి, నూతన కార్యవర్గ ఎన్నికలకు జిల్లా నలుమూలల నుండి సుమారు 300 మంది జీవితకాల సభ్యులు హాజరయ్యారు.

## అంగాళపురంకు 90లక్షలతో తారురోడ్డు



కుప్పం, మే 25 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మండలంలోని కెడిపల్లి పంచాయతీ అంగాళపురంకు 90లక్షలతో నూతనంగా తారురోడ్డును నిర్మించారు. సోమవారం ప్రభుత్వవిప్, కడ పిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పూజ చేసి నూతన రోడ్డును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే సాధ్యమవుతు ందన్నారు. గ్రామాల్లో అవసరమైన చోట్ల సిసి, బిటి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి వసతికి చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా తమకు మేలు చేస్తున్న సిఎం చంద్రబాబుకు మరింత అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కార్పోరేషన్ డైరెక్టర్ శరవణ., క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, నేతలు మహేంద్ర, బాలాజీ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 419 మంది గైర్హాజరు

చిత్తూరు, మే 25 ప్రభాతవార్త:

జిల్లాలో సోమవారం జరిగిన టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష లాంగ్వేజ్-1 పరీక్షకు 419 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష లాంగ్వేజ్-1కు 2,251 మంది విద్యార్థులు హాజరు కావాల్సివుండగా 1,832 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ ఒక పరీక్షా కేంద్రంను తనిఖీ చేయగా ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 14 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలోని 32 పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

## మహానాడును విజయవంతం చేయాలి

### -టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్



శాంతిపురం, మే 25ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఈనెల 27,28 తేదీల్లో శాంతిపురం బాలాజీ,దిలీప్ కళ్యాణ మండపాల్లో నిర్వహించే తెలుగుదేశం పార్టీ మండల మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు, మాజీ అధ్యక్షుడు జనార్ధనరెడ్డి, నేతలు చంద్ర, గిరి మాట్లాడారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ల అధ్వర్యంలో జరిగే వర్చువల్ మహానాడు కార్యక్రమంకు నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. క్రమశిక్షణ గల టిడిపి నిర్వహించే మహానాడును జయప్రదం చేసే బాధ్యత నేతలు, కార్యకర్తలపై ఉందని పికెఎం ఉడా చైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. సమావేశంలో నేతలు ఎల్.జయరాంరెడ్డి, మణి, పిఎసిఎస్ అధ్యక్షుడు గోపాల్, మహిళా నేతలు సుగుణమ్మ, చంద్రకళ, అనసూయ, రుద్రప ్ప, రాజు, బాలు, నాగరాజు, శ్యామలమ్మ, పెద్దన్న, దాము, మంజునాథ్, బసవశంకర్ పాల్గొన్నారు.

## రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ

శాంతిపురం, మే 25 ప్రభాతవార్త




ప్రభుత్వం తరపున రైతులకు రాయితీతో జీలు,పచ్చిరొట్ట, ఆకు విత్తనాలను సోమ వారం టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్ పంపిణీ చేప ట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఇరవై కి ్వంటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయ న్నారు. పది కిలోల బ్యాగుకు రైతులు 800చెల్లించాలన్నారు. విత ్తనాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నేతలు గిరి, చం ద్ర, రాజు, హరినాథరెడ్డి, శివ పాల్గొన్నారు.

## హౌసింగ్ ఎఇ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే

గుడిపాల, మే 25 ప్రభాతవార్త:

గుడిపాలలో నూతనంగా నిర్మించిన హౌసింగ్ ఎఇ కార్యాలయంను సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో వుండి మెరుగైన సేవలు అందించాలన్నారు. అలాగే ఇళ్ళ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హులైన వారికి ఇళ్ళను మంజూరు చేయాలన్నారు. హౌసింగ్ అధికారులు లబ్దిదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, మండల పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ, సింగిల్‌విండో చైర్మన్ ప్రతాప్‌నాయుడు, హౌసింగ్ ఇఇ శంకరప్ప, డిఇ శ్రీధర్, తెలుగుదేశం నాయకులు బాలాజీనాయుడు, అనిల్‌కుమార్, సుమతి మురళీ, గోళ్ళ హేమాద్రినాయుడు, తుమ్మల లలిత తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల విజయానికి సమన్వయంతో పనిచేయాలి

## -జెఈఓ వీరబ్రహ్మాం



తిరుపతి(నారాయణవనం),మే 25ప్రభాతవార్త: నారాయణవనంలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 28 నుండి జూన్ 5వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, సమష్టి కృషితో అత్యంత వైభవంగా నిర్వహించాలని టిటిడి జెఈఓ వీరబ్రహ్మాం అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. మే 28న జరిగే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. జూన్ 1న గరుడవాహన సేవ, జూన్ 4న రథోత్సవం మరియు కళ్యాణోత్సవం, జూన్ 5న చక్రస్నానం బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన, వైభవోపేతమైన ఘట్టాలని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శ్రీవారి కల్యాణోత్సవంను ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని సూచించారు. ఆలయ రథం స్థితిని పూర్తిగా పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహించాలని, వాహన సేవలకు అవసరమైన తండ్లు, ఘటాటోపం సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని స్కౌట్స్, శ్రీవారి సేవకులను తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని చెప్పారు. అనంతరం ఆలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, డిప్యూటీ ఈఓ సెల్వం, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి ,విజిఓ గిరిధర్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్. ఎస్. కుసుమ కుమారి, ఎస్ ఈ3 జయరాం నాయక్, డీఈలు సరస్వతి, రవిశంకర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమానికి 51 వినతులు

### -సిఎండి శివశంకర్ లోతేటి



తిరుపతి,మే 25ప్రభాతవార్త : ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమానికి 51 వినతులు అందాయని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.. ఈ కార్యక్రమం సందర్భంగా పలువురు వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 , 1800 425 155333కు కాల్ చేయడం ,వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.

## ఇంటర్ సప్లిమెంట్‌లో 1,026 మంది విద్యార్థులు గైర్హాజరు



తిరుపతి విద్య, మే 25 ప్రభాతవార్త తిరుపతి జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రజా అదనపు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు ప్రాంతీయ తనిఖీ అధికారి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.మొదటి విడత పరీక్షల్లో సాధారణ విద్యకు చెందిన 52 పరీక్షా కేంద్రాల్లో 11,530 మందికి పరీక్షలు కేటాయించగా, 10,952 మంది హాజరయ్యారని చెప్పారు. 578 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. వృత్తి విద్యకు చెందిన 305 మందిలో 281 మంది పరీక్షలు రాశారని తెలిపారు. మొత్తం మొదటి విడతలో 11,835 మందికి పరీక్షలు కేటాయించగా, 11,233 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.అలాగే రెండో విడత పరీక్షల్లో సాధారణ విద్యకు చెందిన 4,110 మందిలో 3,696 మంది హాజరయ్యారని, 414 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. వృత్తి విద్యలో 161 మందికి గాను 151 మంది పరీక్షలు రాశారని వెల్లడించారు. మొత్తం రెండో విడతలో 4,271 మందికి పరీక్షలు కేటాయించగా, 3,847 మంది హాజరైనట్లు తెలిపారు.రెండు విడతలు కలిపి మొత్తం 16,106 మందికి పరీక్షలు కేటాయించగా, 15,080 మంది హాజరయ్యారని, 1,026 మంది గైర్హాజరైనట్లు రాజశేఖర్ రెడ్డి వెల్లడిం చారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

# ప్రభుత్వ బడులల్లో పిల్లలను చేర్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి : ఎమ్మెల్యే







కేవీబీ పురంలో బడిపిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్.కుమార్

బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్చాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

కేవీబీ పురం, మే 25 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ఫ్రీ ప్రైమరీ మోడల్ స్కూలులో సోమవారం మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు సారథ్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాసత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్.కుమార్ పాల్గొని బడిపిలుస్తోంది కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారుల మేరకు పదో తరగతి ఉత్తీర్ణ శాతం పెరుగుదల, ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడులకు 40 మంది విద్యార్థులు చేరిక, పాఠశాలలు పునః ప్రారంభం అయ్యే వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కొనసాగించాలని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను నారా లోకేష్ ఛాలెంజ్‌గా తీసుకుని కార్పొరేట్ స్కూల్స్ కంటే ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, విద్యాభివృద్ధికి తోడ్పడుతూ ఉన్నారని తెలిపారు. అలాగే పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో ఉండే సదుపాయాలు ప్రభుత్వ బడుల్లో కల్పిస్తూ, సాంకేతిక విజ్ఞానంతో కూడినటువంటి విద్య అందిస్తూ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ రాష్ట్రానికి మంచి పేరు తీసుకు వస్తున్నారని వెల్లడించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయులు పట్టుదల, కృషి, ఐక్యతతో పని చేస్తూ విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీస్తూ, వారిలో విలువలను క్రమశిక్షణలను పెంపొందిస్తూ వారిని భవిష్యత్‌లోఉన్నత స్థాయిలకు చేర్చాలని ఆకాంక్షించడం జరిగింది. ఎమ్మెల్యే ప్రకటించిన సొంత నిధులతో మండలంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల ఫలితాల్లో రాణించిన ధనుష్, సూర్య, భవ్యశ్రీ విద్యార్థులకు ఒక్కొక్కరికి 5 వేలు నగదు, మెమెంటో, షీల్డ్‌లను ఎమ్మెల్యే అందజేశారు.

మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మిపతి, రవికుమార్‌లు మాట్లాడుతూ మండలంలోని బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరిపిస్తూ వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ బడులపై అవగాహన కల్పించే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇళంగోవన్‌రెడ్డి, ఏ.శివరావు, పాలమంగళం రమేష్, పన్నూరు బాలాజీ, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌సీహెచ్‌ఎంలు సురేష్, రామిరెడ్డి, రవిచంద్ర, పూర్ణచంద్రారెడ్డి, ఆర్.కె. ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుపతిలో జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య



తిరుపతి,మే 25ప్రభాతవార్త: తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని తిరుపతి జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య సూచించారు..మహానాడుకు ముందు ఆయన జోనల్‌కోఆర్డినేటర్‌గా తొలిసారి తిరుపతికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ ముఖ్య నాయకులు కలిశారు. ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.

## కేజీబీవీల్లో బోధనా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల



తిరుపతి విద్య, మే 25 ప్రభాతవార్త తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీలు) ఖాళీగా ఉన్న వివిధ బోధనా పోస్టుల భర్తీకి రాష్ట్ర స్థాయిలో నోటిఫికేషన్ విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ తెలిపారు. ఈ నియామకాలు పూర్తిగా ఒప్పంద ప్రాతిపదికన 2026 27 విద్యా సంవత్సరానికి మాత్రమే అమలులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 299 బోధనా పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రిన్సిపాల్, పీజీటీ, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు ఉన్నాయని, ఈ నియామకాలు మహిళా అభ్యర్థులకు మాత్రమే వర్తిస్తాయని వెల్లడించారు.తిరుపతి జిల్లాలోని 9 కేజీబీవీ పాఠశాలల్లో మొత్తం 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇందులో కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ పోస్టులు 3, పీజీటీ పోస్టులు 5, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు 5 ఉన్నాయని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ విభాగంలో గణితం - 1, నేచురల్ సైన్స్ - 2 పోస్టులు ఉండగా, పీజీటీ విభాగంలో ఇంగ్లీష్ - 1, మ్యాథ్స్ - 1, ఫిజిక్స్ - 1, కెమిస్ట్రీ - 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు.అభ్యర్థులు తప్పనిసరిగా మహిళలు కావాలని, సంబంధిత విద్యార్హతలు, బి.ఎడ్/పీజీ అర్హతలు కలిగి ఉండాలని కెవిఎన్ కుమార్ తెలిపారు. సంబంధిత పోస్టులకు టెట్ అర్హత తప్పనిసరి కాగా, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ మరియు కొన్ని వృత్తి విద్య పీజీటీ పోస్టులకు టెట్ అవసరం లేదని చెప్పారు.2025 జూలై 1 నాటికి అభ్యర్థుల కనిష్ట వయస్సు 18 సంవత్సరాలు, గరిష్ట వయస్సు 45 సంవత్సరాలు ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 సంవత్సరాలు, దివ్యాంగులకు 52 సంవత్సరాల వరకు వయోపరిమితి సడలింపు కల్పించినట్లు వెల్లడించారు.అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల ప్రక్రియ మే 27 నుంచి ప్రారంభమై జూన్ 5తో ముగియనుందని తెలిపారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ జూన్ 9న, తుది మెరిట్ జాబితా జూన్ 16న విడుదల కానుండగా, నియామక ఉత్తర్వులు జూన్ 18న జారీ చేసి, ఎంపికైన అభ్యర్థులు జూన్ 20న విధుల్లో చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు.అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని గడువు తేదీకి ముందే ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ కోరారు.

## వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమానికి శ్రీకారం



తిరుపతిరూరల్, మే 25 ప్రభాతవార్త: 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతిరూరల్ మండలం న్యూమంగళం పంచాయతీ పరిధిలోని మిట్ట గాంధీపురం గ్రామ సమీపంలో రెండు ఎకరాల స్థలంలో రూ.24కోట్ల రుపాయాలతో ఎంఎస్‌ఎంఈ పార్క్ స్థాపనకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ నాయకత్వంలో పారిశ్రామికాభివృద్ధి ఉద్యోగావకాశాల పెంపే లక్ష్యమన్నారు. ఈ ఎంఎస్‌ఎంఈ పార్క్ ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని, గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామికవేత్తలను తయారు చేసే దిశగా ఇది కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## గోవధ నిషేధానికి కేంద్రం చట్టం తీసుకురావాలి

తిరుపతి విద్య, మే 25 ప్రభాత వార్త





తిరుపతిలో జమాత్ఎ ముస్లిమీన్ ప్రతినిధులు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు ను కలిసి గోవధ నిషేధంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరుతూ వినతిపత్రం సమర్పిం చారు. దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణతో పాటు సామాజిక ఐక్యత, మత సామరస్యాన్ని కాపాడేందుకు గోవులను రక్షి ంచడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా గోవులపై జరుగుతున్న హింసాత్మక ఘటనలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని, గోవధను పూర్తిగా నిషేధించేలా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. గోవును కోట్లాది మంది ప్రజలు పవిత్రంగా భావిస్తున్నారని, ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే గోవును జాతీయ జంతువుగా ప్రకటించి దేశవ్యాప్తంగా గోవుల సంరక్షణకు ప్రత్యేక విధానాలు అమలు చేయాలని కోరారు. గోవుల రక్షణ ద్వారా దేశంలో శాంతి, సామరస్య వాతావరణం మరింత బలపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ మేరకు తమ వినతిని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు ను జమాత్ఎముస్లిమీన్ ప్రతినిధులు కోరినట్లు తెలిపారు.

## త్రిశూలం వితరణ



పుత్తూరు రూరల్, మే 25 ప్రభాతవార్త: పుత్తూరు మండల పరిధిలోని ఉత్తరపు కండ్రిగ దళితవాడలో గ్రామదేవత గంగమ్మతల్లి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గంగమ్మతల్లికి త్రిశూలం వితరణగా అందించారు. ముందుగా త్రిశూలంకు విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణలు చేసిన అనంతరం వితరణగా త్రిశూలం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## పాలియేటివ్ కేర్ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం



తిరుపతి హెల్త్, మే 25, ప్రభాతవార్త తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రి మరియు ఎస్ వి వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఎస్ వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు, రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బి. మనోహర్, ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం మే 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు ఐదు రోజులపాటు పాలియేటివ్ కేర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు, వైద్య అధికారులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక ఆదేశాల మేరకు, రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు, రాష్ట్ర నోడల్ అధికారుల పర్యవేక్షణలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, కడప, ఆత్మకూరు, ప్రొద్దుటూరు, మదనపల్లి తదితర ప్రాంతాల ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి వైద్య అధికారులు, అనస్థీషియా వైద్యులు, ఫిజిషియన్లు, నర్సింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో మొత్తం సుమారు అరవై మంది వైద్య సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరై పాలియేటివ్ కేర్ సేవలపై ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. పాలియేటివ్ కేర్ రంగంలో హోమి బాబా వద్ద శిక్షణ పొంది, అనుభవం కలిగిన డాక్టర్ కె. రోజారమణి, డాక్టర్ కరుణ, డాక్టర్ అనువేష్, డాక్టర్ భారతి తదితర ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొనేవారికి సమగ్ర శిక్షణ అందిస్తున్నారు. రోగుల జీవితాంత సంరక్షణలో మానవీయ దృక్పథం, నొప్పి నియంత్రణ, మానసిక ధైర్యం కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమానికి అవసరమైన వసతి, భోజన సదుపాయాలు మరియు ఇతర ఏర్పాట్లను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీ హెచ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసారు. రాష్ట్ర ప్రభుత్వం పాలియేటివ్ కేర్ సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ప్రాంతీయ మరియు బోధనా ఆసుపత్రుల వరకు విస్తరించాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఈ శిక్షణ తీసుకునే సిబ్బంది పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో వీరు ముందడుగు వేస్తారని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ బి మనోహర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎస్వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, రుయా ఆస్పత్రి రిటైర్డ్ సూపరిటెండెంట్ డాక్టర్ టీ భారతి, ఏఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ, వైద్యులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, తదుతరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో కాంబాకం జూనియర్ లైన్‌మెన్ మృతి



వరదయ్యపాలెం, మే 25, ప్రభాతవార్త విధి నిర్వహణలో కాంబాకం జూనియర్ లైన్ మెన్ ఏ.రాజశేఖర్ మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని కాంబాకం గ్రామంలో రాత్రి సమయంలో కరెంట్ నిలిచిపోవడంతో మరమ్మత్తుల కోసం వరదయ్యపాలెం చెరువు వద్ద వున్న జంపర్ లైన్ అమర్చడానికి జూనియర్ లైన్ మెన్ ఏ.రాజశేఖర్ వెళ్ళాడని స్థానికులు తెలిపారు. విధి నిర్వహణలో ఉండగానే ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రమా దానికి గురై మృతి చెందినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడు రాజశేఖర్‌కు ఇటీవలే వివాహం కాగా, మూడు నెలల పసిబిడ్డ ఉన్నట్లు సమాచారం. ఈ విషాద ఘటన కుటుంబ సభ్యులను, గ్రామ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రజలకు విద్యుత్ సేవలు అందించే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన రాజశేఖర్ సేవలను ఎప్పటికీ మరువలేమని స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

## వైభవంగా పల్లకిసేవ

పుత్తూరు రూరల్, మే 25 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షిసమేత శ్రీ సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారు, అమ్మవారు పల్లకిపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పిం చారు. ఉదయం ఆలయం లోని మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంక రణలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పరివార దేవ తలకు కూడా అభిషేకాలు, అలంకరణలు చేశారు. రాత్రి విద్యుత్ దీపాలంకరణ వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు భక్తులు హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## మెకానిక్ మునిరెడ్డికి ఆర్థిక సాయం

తిరుపతి కలెక్టరేట్. మే 25 ప్రభాతవార్త : ఆకస్మిక అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన మెకానిక్ మునిరెడ్డికి ఆపరేషన్ వైద్య ఖర్చులు నిమిత్తం తిరుపతి మోటార్ మెకానిక్ అసోసియేషన్ నేతలు సోమవారం 10,000 రూపాయలు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. మెకానిక్ వృత్తి జీవనాధారంగా సాగుతూ కుటుంబాన్ని పోషించు కుంటున్న ముని రెడ్డి ఆసుపత్రి పాలు కావడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. విషయం తెలుసుకున్న తిరుపతి మోటార్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆసుపత్రికి చేరుకొని మెకానిక్ మునిరెడ్డిని పరామర్శించారు. వైద్య ఖర్చులకోసం అసోసియేషన్ తరపున తక్షణ సాయంగా 10,000 రూపాయలు అందించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టీ. జలంధర్, ఉపాధ్యక్షుడు వి. ప్రభు, కోశాధికారి గౌస్ బాషా, సహాయ కార్యదర్శి పి. తేజ రెడ్డి, కమిటీ ఇంచార్జ్ ఎం. కేశవాచారి, ఎలక్ట్రికల్ విభాగం ఇంచార్జ్ విక్కీ, కే. మణికంఠ, ఏ.కుపేంద్ర, బి. నాగరాజు,తరుణ్, కే. మురుగ, పాపయ్య, ఇంద్ర ఉన్నారు.

## ఉన్నత చదువులు చదివి విలాసాల కోసం దొంగతనాలు

### -రూ.25 లక్షల విలువ చేసే వస్తువులు స్వాధీనం



తిరుపతి,మే 25ప్రభాతవార్త: దురలవాట్లు, సులభంగా డబ్బు సంపాదించడం కోసం చైన్ స్నాచర్లుగా మారిన ఉన్నత విద్యావంతులు చివరకు పోలీసులకు పట్టుబడ్డారు.తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో మొత్తం తొమ్మిది బంగారు గొలుసు దొంగతనాల నేరాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తిరుపతి నగరంతో పాటు నెల్లూరు, కావలి, గూడూరు ప్రాంతాల్లో వరుస గొలుసు దొంగతనాలకు పాల్పడు తున్న ముగ్గురు సభ్యుల అంతర్ జిల్లా దొంగల ముఠాను తిరుపతి క్రైమ్, వెస్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతిలో జరిగిన గొలుసు దొంగతనాల కేసుల దర్యాప్తుకు అదనపు ఎస్పీ క్రైమ్స్ ఆర్ల శ్రీనివాసులు నేతృత్వంలో డీఎస్పీ తిరుపతి ఎం. భక్తవత్సలం పర్యవేక్షణలో వెస్ట్ పోలీస్ స్టేషన్ సిఐ పి. రామకృష్ణ క్రైమ్ సిఐ ఎన్. శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో బెంగళూరుకు చెందిన నెల్లూరు జిల్లా తూర్పు ఎర్రబల్లిగ్రామవాసి శీలం నాగార్జున రెడ్డి (28) అగ్రికల్చరల్ బీఎస్సీ పూర్తి చేశాడు. నెల్లూరు జిల్లా వింజమూరు మండలంకు చెందిన నల్లగొండ వెంకట మురళి (26), బీకాం కంప్యూటర్స్ గ్రాడ్యుయేట్. నెల్లూరు జిల్లా పప్పుల వీధికి చెందిన లింగాలదిన్నె విష్ణువర్ధన్ రెడ్డి (28), బీఎస్సీ స్టాటిస్టిక్స్ చదివి, బెంగళూరులోని బైజూస్ కంపెనీలో సిస్టమ్ ఇంజనీర్‌గా పనిచేశాడు. వీరినుండి 25 లక్షల విలువ చేసే సుమారు 130 గ్రాముల బంగారు ఆభరణాలు ,మోటారుసైకిళ్ళు, మొబైల్ ఫోన్లు, హెల్మెట్లు, క్యాపులు, మాస్కులు స్వాధీనం చేసుకున్నారు.

## జిల్లాలో 3099 మందికి...రూ.6.19 కోట్లు మంజూరు



వాకాడు, మే 25 ప్రభాతవార్త: మత్స్యకార సేవలో పథకం కింద చేపల వేట నిషేధ కాలంలో జీవనోపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలకు తిరుపతి ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతులు మీదుగా చెక్కులు పంపిణీ చేసిన్నట్లు ఫిషరీస్ ఎఫ్‌డిఓ జి. రఘు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3099 మందికి రూ. 6.19 కోట్లు మంజూరైన్నట్లు వాకాడు మండలానికి 364 బోట్లకి మత్స్యకారులకు 1494 మందికి 1400 మందికి 20 వేల రూపాయిలు జమ అయ్యిందని తెలిపారు. మిగిలిన 94 మంది మత్స్యకారులు పరిశీలనలో ఉన్నారని తెలిపారు. మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మత్స్యకారులు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కి, సత్యవేడు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి, వెంకటగిరి, ఎమ్మెల్యేలకు జిల్లా కలెక్టర్, ఫిషరీస్ డిపార్ట్మెంట్ డిపార్ట్మెంటుకు, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, వాకాడు మండల తూపిలిపాలెం పెద్ద కాపు, మాజీ సర్పంచ్ ఆర్కేట్ మహేంద్రకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలి



బాలాయపల్లి, మే 25 ప్రభాతవార్త : మండలంలోని మన్నూరు గ్రామానికి ఆర్టిసి బస్సును పునరుద్ధరించాలని సిపిఎం నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చంగయ్య తెలిపారు. సిపిఎం పల్లిపాడు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బాలాయపల్లి మండలం పల్లిపాడు గ్రామానికి గూడూరు డిపో నుండి నడిచే ఆర్టీసీ బస్సు సేవను వెంటనే పునరుద్ధరించాలని సోమవారం పల్లిపాడు గ్రామ సీపీఎం కమిటీ తరఫున మన్నూరు సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పల్లిపాడు గ్రామానికి గతంలో గూడూరు డిపో నుండి ఆర్టీసీ బస్సు సక్రమంగా నడుస్తుండేదని, రోడ్డు మరమ్మతుల కారణంగా గత రెండు నెలలుగా బస్సు సేవ నిలిపివేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం రోడ్డు మరమ్మతులు పూర్తయి రాకపోకలకు అనుకూలంగా ఉన్నప్పటికీ, బస్సు పల్లిపాడు గ్రామానికి రాకుండా మన్నూరు వరకు మాత్రమే నడపడం వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రఫీ, శేషయ్య, శాంత కుమార్, పెద్ద అంకయ్య, వెంకట రమణయ్య, అంకయ్య, సుబ్బులయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ మహానాడును జయప్రదం చేయండి : ఎమ్మెల్యే



బాలాయపల్లి, మే 25 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా, పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో ప్రతి క్లస్టర్ స్థాయిలో ఘనంగా విజయవంతం చేయాలని నాయకులకు సూచించారు. ఈనెల 27, 28 తేదీలలో డిజిటల్ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమ సన్నాహకాలపై ఆయన అన్ని మండల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1848 క్లస్టర్ల ద్వారా జరుగుతున్న ఈ డిజిటల్ మహానాడును మన నియోజకవర్గంలో అందరికీ చేరువయ్యేలా చేయాలి తెలిపారు. ప్రతి క్లస్టర్ వద్ద తప్పనిసరిగా స్క్రీన్లు/ ఎల్ఈడిలు ఏర్పాటు చేసి, మన అధినేతల ప్రసంగాలను ప్రజలు, కార్యకర్తలు వినేలా చర్యలు తీసుకోవాలి అని సూచించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో మహిళలు (స్త్రీ శక్తి) పెద్ద ఎత్తున పాల్గొనేలా వారిని ఆహ్వానించాలి అని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రాయి సత్యం నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, బీరం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలు ఇస్తే...ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు : తహశీల్దార్



సూళ్ళూరుపేట, మే 25 ప్రభాతవార్త: నాయుడుపేట మండల పరిధిలో రెవెన్యూ పరిపాలనా వ్యవస్థను పూర్తిగా గాడిలో పెడతామని, ప్రజల భూ సమస్యల త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని నూతన తహసీల్దార్ జి. చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై దాదాపు 11 అర్జీలు రాగా, వాటిని పరిశీలించిన అనంతరం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో కీలక విషయాలు వెల్లడించారు.

**-కలెక్టర్, ఆర్డీవో సహకారంతో భూ సమస్యల పరిష్కారం :**

తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈరోజు గ్రీవెన్స్ డేకి వచ్చిన అర్జీలలో ఒకరి భూమిని మరొకరు ఆక్రమించుకోవడం, ప్రభుత్వ భూముల్లో దారులు లేకుండా కబ్జా చేయడం, బాధితులకు తెలియకుండానే రికార్డుల్లో పట్టాదారు పాస్ పుస్తకాలు వేరే వాళ్ల పేరు మీదకు మార్చడం వంటి తీవ్రమైన రెవెన్యూ సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. వీటన్నింటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రతి సోమవారం తహసీల్దార్ ఆఫీసులోనే అన్ని శాఖల అధికారులతో కూడిన పిజిఆర్ఎస్ (స్పందన) గ్రీవెన్స్ కార్యక్రమం జరుగుతుందని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యాలయానికి వచ్చే ప్రతి అర్జీని ఆన్లైన్‌లో నమోదు చేసి, తక్షణమే రసీదు నంబర్ ఇస్తామని, ఎన్ని రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందో కూడా ముందే చెప్తామన్నారు. నాయుడుపేట మండలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణే తహసీల్దార్‌గా తన మొదటి ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను, చెరువు పోరంబోకు స్థలాలను ఆక్రమిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని, ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తీవ్రంగా హెచ్చరించారు.

## భూముల రీసర్వే ప్రారంభం

తడ, మే 25 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని తడ మండలం వెండ్లూరుపాడు రెవిన్యూ విలేజ్ లో సోమవారం మండల తహసిల్దార్ రవికుమార్ ప్రారంభించారు. గ్రామానికి సంబంధించిన మొదటి సర్వే నెంబరు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వేద మంత్రాల నడుము లాంచనంగా ప్రారంభించారు. రీసర్వే వేగవంతంగా పూర్తి కావాలని ఎన్నో ఏళ్లగా నెలకొని ఉన్న భూ సమస్యలకు రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రార్థించారు. అనంతరం ఎమ్మార్వో రవికుమార్ మాట్లాడు భూముల రీసర్వేకి రైతులు అందుబాటులో ఉండాలని సహకరించాలని నూతన టెక్నాలజీతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని గ్రామస్తుల నివేదిక ప్రకారం సర్వే ముందుకు సాగుతుందని సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సర్వే పూర్తయిన తర్వాత మరలా గ్రామ సభ నిర్వహించి గ్రామస్తుల అభ్యంతరాలు తెలుసుకొని సమస్యలు పరిష్కరించి అనంతరం క్యూఆర్ కోడ్ కలిగిన పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుంది రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమం రెవెన్యూ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం... వైస్ ప్రెసిడెంట్‌గా చెందేటి సుజాత



సూళ్ళూరుపేట, మే 25 ప్రభాతవార్త: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గా చెందేటి సుజాత నియమితులయ్యారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి.షణ్ముగం ఆధ్వర్యంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హైదరాబాద్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా చెందేటి సుజాత కు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బడికాల శ్రీనివాసులు, జంబూగోళం రేవతి, కె.సుజాత, ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సోత్రీయ భూములు అమ్మకాన్ని ఆపండి !

### - సిపిఐ ఆధ్వర్యంలో గిరిజనులు తహశీల్దార్ కార్యాలయం ముట్టడి



వరదయ్యపాలెం, మే 25 ప్రభాతవార్త: సత్యవేడు నియోజక వర్గంలోని వరదయ్యపాలెం మండలంలో వున్న పాదిరి కుప్పం రెవెన్యూ పరిధిలోని సోత్రియం భూములను రెవెన్యూ అధికారుల అండదండలతో భూములు అమ్ముతున్నారని, ఆ అమ్మకాలు ఆపాలని వరదయ్యపాలెం తాహశీల్దార్ ఆఫీస్‌ను గిరిజనులు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ సందర్భంగా సిపిఐ సత్య వేడు నియోజకవర్గ కార్యదర్శి ఏ.చిన్ని రాజు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా గిరిజనులు తమ కాయ కష్టంతో తీర్చుకొని సాగు చేసుకుంటున్న భూములను రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా గిరిజనులను నానా ఇబ్బందులకు గురిచేసి పోలీస్ స్టేషన్ లో తప్పులు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఆ భూములను పథకం ప్రకారం వీఆర్వోగా పనిచేస్తున్న చలపతి, గతంలో పనిచేసిన విఆర్వోలు స్థానికేతరులకు, రాజకీయ పలుకుబడి కలిగిన వారికి, ధనవంతులకు గిరిజనుల భూములు అమ్మకానికి శోధక శక్తిగా నిలిచి లక్షలాది రూపాయలు సంపాదించారని ఆరోపించారు. ఇప్పుడున్న తాహశీల్దార్ సుధీర్ రెడ్డిని కోరి అనేకసార్లు ధర్నా, ఆందోళన, పోరాట కార్యక్రమాలు చేసిన తరువాత ట్రెంచ్ కొట్టడం జరిగిందన్నారు. ఆ ట్రెంచ్‌ను కొంతమంది రెవెన్యూ అధికారులను లోపర్చుకొని లక్షలాది రూపాయలు చేతులు మారి ఆ ట్రెంచ్ను జెసిబిలతో పూడ్చిస్తుంటే ఈ విషయాన్ని గిరిజనులు తాహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. దీంతో తహసీల్దార్ మీకేం పని పాట లేదా మాకు చాలా పనులు ఉన్నాయని, వీకేఆర్వై కాలనీ ఒకటే కాదని గిరిజనులను బెదిరిస్తున్నారని వాపోయారు. ఇంత దుర్మార్గంగా వ్యవహరించే తాహశీల్దార్లను తాము చూడలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం టెంట్ వేసుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. మధ్యా హ్నం సమయంలో కూడా ఆఫీస్ వద్ద భోజనాలు చేసి మాకు న్యాయం చేసే వరకు మేము ఇక్కడి నుంచి కదలమని అక్కడే కూర్చోవడం జరిగిందన్నారు. అయితే తాహశీల్దార్గానీ, విఆర్ఓగాని ఏమాత్రం గిరిజనులు వారి తరఫున వచ్చిన సిపిఐ పార్టీ నాయకులు చెప్పిన మాటలు పట్టించుకోకుండా, మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి అని నిర్లక్ష్యంగా మాట్లాడడం చాలా దుర్మార్గమన్నారు. ప్రజలు ఇస్తున్న పన్నులతో జీతం తీసుకునే అధికారులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని, పారదర్శకంగా ఉండాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. వరదయ్యపాలెం మండల తహశీల్దార్ ఆఫీసులో జరుగుతున్న అవినీతిపై ఉన్నత అధికారులు ఆరా తీయాలని, అక్రమాలను అరికట్టి సోత్రియం భూములను కాపాడాలని, తాము సాగు చేసుకుంటున్న భూములు మాకే ఇవ్వాలని ప్రభుత్వాన్ని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చంద్ర, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ట్రెజరర్ ధనుంజయ శెట్టి, మండల నాయకులు ధనుంజయ నాయుడు, గిరిజన నాయకులు చెల్లమ్మ, వెంకటేశయ్య, మారయ్య, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



సూళ్లూరుపేట, మే 25 ప్రభాతవార్త: సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ప్లాట్ ఫాం నెం.01 వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని గమనించిన రైల్వే భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సూళ్లూరుపేట జీఆర్పీఎస్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రం దగ్గర సుమారు 54 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో కనిపించాడు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రమేష్ కుమార్ పరిస్థితిని గమనించి వెంటనే 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. గూడూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శివయ్య సేవలో కేంద్ర మంత్రి కింజరపు



శ్రీకాళహస్తి, మే 25 ప్రభాతవార్త: కేంద్ర పౌరవిమానయాన శాఖామాత్యులు కింజరపు రామమోహన్ నాయుడు కుటుంబసమేతంగా వాయులింగేశ్వరుని దర్శనానికి వచ్చారు. సోమవారం మంత్రి కుటుంబ సభ్యులతో రాగా దక్షిణ గోపురం వద్ద ఘన స్వాగతం పలికారు. ఓ వైపు తెలుగుదేశం పార్టీ శ్రేణులు, మరో వైపు ఆలయాధికారులు ప్రోటోకాల్ మేరకు స్వాగతం ఏర్పాటు చేసారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, ఆలయ ఇఓ బికె వెంకటేశులు సారథ్యంలో ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో వేద మంత్రాలు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. మంత్రికి బొజ్జల రిషితారెడ్డి సారథ్యంలో తెలుగుదేశం శ్రేణులు హాజరయ్యారు. మంత్రి తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చినపుడల్లా శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకోవటం జరుగుతుంది. ఈ నేపథ్యంలో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చిన వారికి ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తో పాటు మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలతో పాటు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఈస ందర్భంగా బొజ్జల రిషితా రెడ్డి, ఇఓ వెంకటేశులు, చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్‌లు అందించారు. స్వాగతం పలికిన వారిలో బోర్డు సభ్యులు పగడాల మురళి, వాకచర్ల గురప్పశెట్టి, గోపినాథ్, నెమళ్ళూరు బుజ్జి తదితరులు ఉన్నారు. కాగా ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడులు పర్యవేక్షించారు.

## శివయ్య సేవలో...సినీనటి జయప్రద పూజలు



శ్రీకాళహస్తి, మే 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో సోమవారం మాజీ రాజ్యసభ సభ్యురాలు, ప్రముఖ సినీనటి జయప్రద కుటుంబ సభ్యులతో కలసి పూజలు జరిపించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ దక్షిణ గోపురం వద్ద వేద పండితులతో స్వాగతం పలికారు. ఆమె కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనానంతరం వారికి మృత్యుం జయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఈ మేరకు ఇఓ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గురప్పశెట్టి, పగడాల మురలి తదితరులున్నారు. ఏర్పాట్లును ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఆలయ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి!



పెళ్లకూరు, మే 25 ప్రభాతవార్త : పెళ్లకూరు మండలం దొడ్ల వారి మిట్ట గ్రామానికి చెందిన సైమాకొటై. భువన అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే తమిళనాడు రాష్ట్రం, కడలూరు జిల్లా, పన్నటి తాలూకాకు చెందిన భువన పెళ్లకూరు మండలంలోని దొడ్ల వారి మిట్ట గ్రామానికి చెందిన సైమాకొటై ప్రభాకరన్‌ను నాలుగు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. సాఫీగా సాగిన వీరి వివాహ జీవితంలో ఇద్దరు పిల్లలు ప్రణవ్(2), హర్షిక(1)కు జన్మనిచ్చారు. ఇప్పుడు నాలుగు నెలల గర్భవతి గతంలో కలిగిన ఇద్దరు పిల్లలు సిజేరియన్ ఆపరేషన్ ద్వారా జన్మించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆదివారం భువన ఆరోగ్యం బాగాలేదని తమిళనాడులోని ఆమె బంధువులకు ప్రభాకరన్ తెలియజేశాడని అనంతరం కొంచెం సమయంలోనే భువన మరణించినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తుంది. దీనిపై ఆగ్రహించిన భువన తరపు బంధువులు అనుమానం వచ్చి పెళ్లకూరు పోలీస్ స్టేషన్లో సోమవారం పుష్ప అనే మహిళ ఫిర్యాదు చేయడం జరిగింది. ఆమె ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం గత రెండు నెలలుగా భువన ఆమె భర్త మధ్య కుటుంబ కలహాలు అక్రమ సంబంధం పై మనస్పర్ధలు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి భువన మృతికి గల కారణాలను నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని భువన తరపు బంధువులు కోరుతున్నారు.

## చెరువు పోరంబోకు స్థలం ఆక్రమణ యత్నం

### -స్థానికుల అందోళన అధికారులపై ఆరోపణలు



తిరుపతిరూరల్, మే25 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలో చెరువు పోరంబోకు భూముల ఆక్రమణ యత్నం కలకలం రేపుతుంది. ప్రజా అవసరాల కోసం ఉంచిన ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని ఎస్టీ కాలనీలో ఉన్న చెఋవు పోరంబోకు స్థలం, గ్రామ ప్రజల సాధారణ అవసరాల కోసం ఉంచబడింది. ఈప్రాంతంలో ఇప్పటికే సర్వేనెంబర్ 119లో నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేయబడగా, మిగిలిన ఖాళీ స్థలం భవిష్యత్ ప్రజా వినియోగానికి ఉంచారు. అయితే ఆ ఖాళీ స్థలంపై ఓ వ్యక్తి కన్నుపడింది. ఆక్రమణకు సిద్దమయ్యారు. ఇంకా అందోళనకరమైన విషయం ఏమిటంటే ఈ వ్యవహారంలో సంబంధిత విఆర్వో కూడా మౌనంగా సహకరిస్తున్నారని గ్రామస్తులు ఆరోఫిస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారనే ఆరోఫణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కబ్జాదారుడే విఆర్వో హామీ ఇచ్చాడని బహిరంగంగా చెప్పుకుంటున్నారని ప్రజలు చెబుతున్నారు. ఈ ఘటనపై స్పందించిన స్థానికులు వెంటనే రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని, ఆక్రమణ యత్నాన్ని అడ్డుకోవాలని, ఆ స్థలాన్ని ప్రజా అవసరాల కోసం అలాగే ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్దఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు.

## మండల స్టాక్ పాయింట్ చేరిన...పాఠ్యపుస్తకాలు



తడ, మే 25 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు ఉత్తీర్ణతలో ఉత్తమ ప్రతిభ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించారు. నూతన విద్యా సంవత్సరానికి అవసరమైన పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందించవలసిన యూనిఫామ్ ఇతర వస్తువులు ఇప్పటికే మండల స్థాయి స్టాక్ పాయింట్‌కు ఒక్కొక్కటిగా చేరుతున్నాయి. మండల స్టాక్ పాయింట్‌ను మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జునరావు పరిశీలించారు.

## ల్యాప్ రేస్‌లో గోల్డ్ మెడల్స్‌తో మెరిసిన విశిష్ట




తిరుపతి విద్య, మే 25 ప్రభాతవార్త : తిరుపతి తుమ్మల గుంటలోని కెవిఎస్ గ్రౌండ్లో నిర్వహించిన సమ్మర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆకుల విశిష్ట అద్భుత ప్రతిభతో రెండు గోల్డ్ మెడల్స్ సాధించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హరి స్పీడ్ స్కేటింగ్ వరల్డ్ మరియు పవన్ రోలర్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో జూనియర్, సీనియర్ సహా వివిధ విభాగాల నుండి ఉమ్మడి చిత్తూరు జిల్లా, తిరుపతి జిల్లా ప్రాంతాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ల్యాప్ రేస్ కేటగిరీల్లో ఉత్కంఠభరితమైన పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మొదటి ల్యాప్ రేస్‌లో ఆకుల విశిష్ట తన వేగం, సమతుల్యతతో గోల్డ్ మెడల్ సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అదే కేటగిరీలో ఇతర ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారుల కోసం నిర్వహించిన రెండో ల్యాప్ రేస్‌లో కూడా ఆమె మరోసారి అద్భుత ప్రదర్శన కనబరిచి గోల్డ్ మెడల్ సాధించి డబుల్ గోల్డ్ విజయం నమోదు చేశారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, కాంస్య పతకాలు అందజేయగా, పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు అందించారు. ఈ పోటీల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, పోటీ తత్వం ప్రధానంగా కనిపించాయి. తన విజయానికి కోచ్ హరి సార్ అందించిన నిరంతర శిక్షణ, ప్రోత్సాహం ఎంతో తోడ్పడిందని ఆకుల విశిష్ట తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు, క్రీడాకారులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేతలను అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : జిల్లా ఎస్పీ



తిరుపతి, మే 25ప్రభాతవార్త: అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులకు వెంటనే పంపించి, వాటిని ప్రాధాన్యత ఆధారంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిరక్ష్యాన్లికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. పిజిఆర్ఎస్‌కు సోమవారం 85 మంది ఫిర్యాదుదారుల వినతుల పరిశీలన చేశారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుండి వినతులను స్వీకరించారు. ఎస్పీ స్వయంగా ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆధనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాలుసులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మైనర్ బాలిక పట్ల అసభ్యంగా... ప్రవర్తించిన వ్యక్తిపై ఫోక్సో కేసు

తవణంపల్లి, మే 25 ప్రభాతవార్త: మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసిన సంఘటన చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలంలోని పుణ్యసముద్రం హరిజనవాడలో సోమవారం జరిగింది. స్థానిక ఎస్ఐ రమేష్‌బాబు కథనం మేరకు వివరాలిలా వున్నాయి. పుణ్యసముద్రం ఎస్సీ వాడకు చెందిన లోకనాథం అనే వ్యక్తి అదే గ్రామంలోని మైనర్ బాలిక ఇంట్లోకి ఈ నెల 19వ తేదీ అక్రమంగా ప్రవేశించి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి బాధితురాలి బంధువులు సంకోచించినప్పటికీ ఎట్టకేలకు సోమవారం తవణంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

# సురుటుపల్లి వద్ద అరుణాది ఎడమ కాలువపై అక్రమంగా చెట్లు నరికివేత

**నరికివేతను పరిశీలిస్తున్న మండల అధ్యక్షుడు ప్రణీత్‌రెడ్డి**
**మండల అధ్యక్షుడు చొరవతో ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు**



నాగలాపురం, మే 25 ప్రభాతవార్త:
నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లి గ్రామంలో అరుణానదికి సంబంధించి ఇరిగేషన్ శాఖకు చెందిన ఎడమ కాలువపై భారీ వేప చెట్లను ఆ గ్రామానికి సంబంధించిన వైసీపీ నేత ఎటువంటి అనుమతులు లేకుండా నరికివేసి తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సురుటుపల్లి గ్రామంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ అక్రమ చెట్ల నరికివేతపై ఆ గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు మండల అధ్యక్షుడు ప్రణీత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల అధ్యక్షుడు ప్రణీత్‌రెడ్డి వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకుని ఆ గ్రామంలోని స్థానిక నాయకులతో సంయుక్తంగా కలసి అరుణానది ఒడ్డున కట్టపై చెట్ల నరికివేతను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ తమ మండలంలో ఎటువంటి అక్రమ రవాణాలను ఉపేక్షించేది లేదన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇరిగేషన్ శాఖకు సంబంధించి అరుణానది ఎడమ కాలువపై ఉన్న సుమారు లక్ష రూపాయలు విలువ చేసే కలపను నరికివేసి తమిళనాడుకు తరలించినట్లుగా తెలిసిందన్నారు. ఆ గ్రామానికి చెందిన వైసీపీ నేత దిలిప్ ఈ ఘటనకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. అంతేకాక గత కొంత కాలంగా మాజీ సర్పంచ్ భర్త సుబ్రహ్మణ్యం ఆదేశాలతో తన మనవడు చుట్టు పక్కల ప్రాంతాల్లో కలపను నరికివేసి తమిళనాడు రాష్ట్రం గుమ్మడిపూండికి తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. దీనిపై మండల అధ్యక్షుడు ప్రణీత్‌రెడ్డి సంబంధించిన పిచ్చాటూరు ఇరిగేషన్ శాఖ డీఈ శ్రీనివాఉలకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఈ స్పందిస్తూ క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంబంధించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరేంద్రరెడ్డి, సురుటుపల్లి టెంపుల్ బోర్డు మెంబరు రుద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## క్రీడలతో ఖ్యాతి : రామిరెడ్డి ధ్వజారెడ్డి



రైల్వేకోడూరు రూరల్, మే 25 ప్రభాతవార్త
క్రీడలతో ఖ్యాతిని సంపాదించుకోవచ్చని రైల్వేకోడూరు ఉప మండల అధ్యక్షులు వైసిపి సీనియర్ నాయకులు రామిరెడ్డి ధ్వజ రెడ్డి అన్నారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ గంగరాజు పురం లో క్రికెట్ టోర్నమెంట్ ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించి కొద్దిసేపు క్రీడాకారులతో క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా ధ్వజారెడ్డి మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలలో దాదాపు 35 టీంలు పది రోజులపాటు నిర్వహిస్తారని ఇందులో మొదటి బహుమతిగా 60 వేల రూపాయలను అందజేస్తామని ద్వితీయ బహుమతికి 40 వేల రూపాయలను బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుద్యం మరియు ఖ్యాతిని సంపాదించుకొని ఇటు గ్రామానికి మరియు తల్లిదండ్రులకు దేశానికి చక్కటి పేరును సంపాదించుకోవచ్చని ఆయన తెలియజేశారు. క్రీడలు ఎంతో పేరు ప్రఖ్యాతుల ద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపును పొందవచ్చని అందుకోసమే ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆర్ వి రమణ, దార్ల చంద్రశేఖర్, యజ్ఞం చంద్రశేఖర్, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, గోపి, రామకృష్ణ, పుష్పలత, ఎంపీటీసీ నూక మహేశ్వర్ రెడ్డి, యాదవ సంఘం నాయకులు కౌరడి సిద్దయ్య, అనంతరాజుపేట మైనార్టీ నాయకులు షేక్ షఫీ, బత్తలమని, కంభం శ్రీనివాసులు రెడ్డి, గిరివర్మ, ఆర్గనైజర్లు అనిల్, హరి, సుధా, బాబు, అబ్దుల్లా తోపాటు గంగరాజుపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు న్యాయం చేకూరేలా రెవెన్యూ అధికారులు పనిచేయాలి

## - ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీ పురం, మే 25 ప్రభాతవార్త:
మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ తనూజ సమక్షంలో ఎమ్మెల్యే తానే స్వయంగా మండలంలో వచ్చిన వినతిపత్రాలను అందుకున్నారు. ఇచ్చిన వినతిపత్రాల్లోని సమస్యలను పరిశీలిస్తూ ఇచ్చిన వ్యక్తులను పేరు పేరునా పిలిచి వారి సమస్యలను స్వయంగా పరిష్కరించారు. అలాగే దిగువ పుత్తూరులోని కాలనీ యొక్క భూ సమస్యను వీఆర్‌వోకు సూచనలు ఇస్తూ తక్షణమే వారి గ్రామానికి వెళ్లి వారి సమస్యలను భూ పంపిణీ కార్యక్రమాన్ని పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామానికి సంబంధించిన రెవెన్యూ శాఖ పరిధిలో ఏదైనా సమస్యలు వచ్చినప్పటికీ వాటికి పరిష్కారం చూపే విధంగా ఉండాలని, పేద ప్రజలకు న్యాయం చేకూరేలా పని చేయాలని పేర్కొన్నారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన ప్రతి సమస్యలో మంచి, చెడు గ్రహించి పేద ప్రజలకు తోడుగా నిలబడాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ తనూజ, డిప్యూటీ తహసీల్దార్ మాధురి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఏఎస్‌వో మల్లీ, వీఆర్‌వో మునిభాస్కర్, జూనియర్ అసిస్టెంట్ సుజాత,



వీఆర్‌వోలు ఉష, రఘు, కృష్ణయ్య, సర్వేయర్లు, పిచ్చాటూరు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఇళం గోవన్‌రెడ్డి, సర్పంచ్ పన్నూరు బాలాజీ, మాజీ ఎంపీపీ మని, పాలమంగళం రమేష్, మనీ, జడ్పీటీసీ శ్రీహరియాదవ్, చెంగారెడ్డి, టీడీపీ నాయకులు ఏ.శివరావు, తలారి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# వై కోట గంగ జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలి : సీఐ

ఓబులవారిపల్లి, 25 మే ప్రభాతవార్త



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం లోని వైకోట గ్రామంలో ఈనెల 27. మరియు 28వ తేదీ నా జరుగు గంగ జాతరను ప్రశాంతంగా జరుపుకొని గ్రామ ప్రజలు బంధువులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించాలని ఈ జాతరలో ట్రాఫిక్ నియమ నిబంధనలు 30 యాక్ట్ పోలీస్ యాక్ట్ ఉందని అందరూ గమనించి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడకుండా ఘర్షణలకు పురు కోల్పకుండా జాగ్రత్తలు వహించాలని గ్రామ పెద్దలకు. ప్రజలు సహాయ సహకారాలు అందించి గంగ జాతరను విజయవంతంగా జరుపుకోవాలని రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు సూచించారు ఈ సమావేశానికి గ్రామ పెద్దలు ప్రజలు హాజరై పోలీసులు చెప్పిన విధంగా సహకరిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్ నాయుడు డిప్యూటీ తాసిల్దార్ సిద్దేశ్వర రావు ఆర్ఐ మల్లికార్జున్ రెడ్డి వీఆర్వోలు పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు

# శాప్ స్పోర్ట్స్ అకాడమీ - 2026 రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ జూడో ఎంపికలు



తిరుపతి క్రీడ, మే 25, ప్రభాతవార్త
తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తిరుపతి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శాప్ స్పోర్ట్స్ అకాడమీ - 2026 రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్,జూడో ఎంపికలు ఘనంగా ప్రారంభమయ్యాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్ తెలిపారు. 15 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలురు, బాలికల కోసం ఈ ఎంపికలు నిర్వహించబడ్డాయని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి శశిధర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, శిక్షకులు, సిబ్బంది, తల్లిదండ్రులు కలిపి సుమారు 150 మంది పాల్గొన్నారన్నారు . రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ, వసతి, భోజనం, ఇతర క్రీడా సదుపాయాలు కల్పించబడతాయన్నారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అదేవిధంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో 2026-27 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర స్థాయి ఎంపికలు క్రింది క్రీడల కోసం నిర్వహించబడనున్నాయన్నారు. తిరుపతి జిల్లా ఎంపికల తేదీలు వివరాలు ఇలా వున్నాయి. ఈ నెల 26వ తేదీ బాక్సింగ్,26వ తేదీ వెయిట్ లిఫ్టింగ్, 28వ తేదీ రైఫిల్ షూటింగ్, లాన్ టెన్నిస్ ఎంపికలు శ్రీ నివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, తిరుపతిలో ఆయా తేదీల్లో ప్రతి రోజు ఉదయం 7గంటలకు జరుగుతాయాన్నారు. బాలురు, బాలికలు 15 సంవత్సరాలు పైబడిన వారు, 19 సంవత్సరాలలోపు వయస్సుగల వారు అర్హులు అని తెలిపారు. క్రీడల వారీగా బాక్సింగ్ విభాగంలో బాలురు 15,వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో బాలురు 15 ఖాళీలు ఉన్నాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ, వసతి, భోజనం,ఇతర క్రీడా సదుపాయాలు కల్పించబడతాయన్నారు. రైఫిల్ షూటింగ్ విభాగంలో బాలురు 10, బాలికలు 10 (డే బోర్డర్), లాన్ టెన్నిస్ విభాగంలో బాలురు 10, బాలికలు 10 (డే బోర్డర్)లు ఖాళీలు ఉన్నాయని ఎంపికైన అభ్యర్థులకు క్రీడా సదుపాయాలు అందించబడతాయని ఆయన తెలిపారు.అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డు,జనన తేది ధృవీకరణ పత్రం,మెడికల్ సర్టిఫికేట్,పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు - 10, క్రీడలకు సంబంధించిన సర్టిఫికెట్లు, స్టడీ సర్టిఫికెట్లు, గతంలో పాల్గొన్న పోటీలు సాధించిన విజయాల వివరాలు తీసుకురావాలని తెలిపారు.ఎంపికలకు హాజరయ్యే అభ్యర్థులు తమ క్రీడలకు సంబంధించిన స్పోర్ట్స్ కిట్స్‌తో హాజరుకావాలని, అభ్యర్థులు క్రింది లింక్ ద్వారా శాప్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

# ఇ.ఓకు కృతజ్ఞతలు తెలిపిన ఒప్పంద అధ్యాపకులు



తిరుపతి విద్య, మే 25 ప్రభాతవార్త
తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు, ఉపాధ్యాయులు తమకు గుర్తింపు కార్డు, లడ్డూ కార్డు, ఆరోగ్య కార్డులను మంజూరు చేసిన కార్యనిర్వహణాధికారి ముద్దాడ రవిచంద్రను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు.గత 24 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు, ఉపాధ్యాయులకు మే 6న జరిగిన తితిదే పాలకమండలి సమావేశంలో గుర్తింపు కార్డు, లడ్డూ కార్డు, ఆరోగ్య కార్డులు ఇవ్వాలని తీర్మానం చేసిన విషయం తెలిసిందే. అలాగే విద్యాసంస్థల్లో మెరుగైన విద్య అందించేందుకు అవసరమైన మౌలిక వసతుల కోసం సుమారు రూ.146 కోట్లు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని అధ్యాపకులు పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా కళాశాలల అభివృద్ధికి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షి స్తూ తితిదే కార్యనిర్వహణాధికారి ముద్దాడ రవిచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తితిదే పాలకమండలి అధ్యక్షుడు బి.ఆర్.నాయుడు, విద్యా కమిటీ సభ్యులు పానబాక లక్ష్మి, ఎం.ఎస్.రాజు, భానుప్రకాష్ రెడ్డి, ఇతర పాలకమండలి సభ్యులు, అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శరత్, వీరబ్రహ్మం, విద్యాశాఖాధికారి వెంకట సునీల్‌కు కూడా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తితిదే ఒప్పంద అధ్యాపకుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ జి.పద్మజ, ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.విజయ్ కుమార్, కార్యదర్శులు డాక్టర్ ఏ.శేషాద్రి, డాక్టర్ డి.సుధాకర్‌తో పాటు పలువురు ఒప్పంద అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


# కడూరు సొసైటీ చైర్మన్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ



వరదయ్యపాలెం, మే 25, ప్రభాతవార్త
పంటలు పండించి భారతదేశానికి వెన్నెముఖగా నిలిచే రైతన్నలకు అండగా నిలుస్తూ సబ్సిడీని అందించే మంచి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో వరదయ్యపాలెం రైతన్నలకు యూరియాను కడూరు సొసైటీ చైర్మన్ ఆణిముత్యం,నంద కిషోర్ రెడ్డి, వ్యవసాయ అధికారిణి గౌరీ, సొసైటీ డైరెక్టర్లు రవి రెడ్డి, రమేష్ చేతుల మీదుగా అందజేశారు. సుమారు 450 బస్తాల యూరియా పంపిణీ చేశారు. అంతే కాకుండ రైతులకు సకాలంలో వ్యవసాయానికి కావలసిన ఋణ సహాయం కూడా సొసైటీ అందిస్తుందన్నారు.అందువల్ల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ నంద కిషోర్ రెడ్డి తెలిపారు.

# ప్రశాంతంగా పదో తరగతి అదనపు పరీక్షలు

## తెలుగు పరీక్షకు 390 మంది విద్యార్థులు గైర్హాజరు



తిరుపతి విద్య, మే 25 ప్రభాత వార్త
తిరుపతి జిల్లాలో పదో తరగతి అదనపు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు. తెలుగు పరీక్షకు 1,757 మందికి గాను 1,367 మంది హాజరుకాగా, 390 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి పరీక్షల్లో 282 మందికి గాను 247 మంది హాజరై, 35 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షల్లో 102 మందికి గాను 79 మంది హాజరై, 23 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ శ్రీకాళహస్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో ఏర్పాటు చేసిన ఏ,బీ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వ పరీక్షల విభాగానికి చెందిన సహాయ కమిషనర్ ఆరు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏడు

# నాగలాపురం కావమ్మ తిరుణాళ్ళకు పోలీసు బందోబస్తు కల్పించాలి



నాగలాపురం, మే 25 ప్రభాతవార్త:
నాగలాపురం మేజర్ పంచాయతీలోని రెడ్డివీధిలో ఉన్న శ్రీ కావమ్మ సమేత మారయ్య దేవాలయంలో ఈ నెల 27,28,29 తేదీల్లో నిర్వహించనున్న తిరుణాళ్ళ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సోమవారం ఎస్ఐ సునీల్‌ని మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా 29వ తేదీ శ్రీ కావమ్మతల్లి ఊరేగింపు కార్యక్రమం జరగనుందని ఊరేగింపు సమయంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయవలసిందిగా నిర్వాహకులు ఎస్ఐని కోరారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసుల సహకారం అవసరమని గుడి నిర్వాహకులు, గ్రామ పెద్దలు పోలీసులను కోరారు.

# సిరుగురాజుపాళెం రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని డీఎస్పీకి వినతి

పుత్తూరు రూరల్, మే 25 ప్రభాతవార్త:
పుత్తూరు మండలం సిరుగురాజుపాళెం, తడుకు పంచాయతీ రింగ్ రోడ్డు గత మూడు నెలలుగా రోడ్డు గురించి అధికారులకు అర్జీలు, పలుమార్లు ధర్నాలు చేయడంతో ఎమ్మెల్యే స్పందించి రోడ్డు మంజూరు చేశారు పంచాయతీ ప్రజలు తెలిపారు. అయితే కాంట్రాక్టర్ రెండు నెలల నుంచి పనులు ప్రారంభించి జేసీబీలతో రోడ్డును తవ్వేసి, ఇరువైపులా గ్రావెలు తోలి వదిలేయడంతో పంచాయతీ ప్రజలు 108, గ్యాస్ బండి, అంగన్‌వాడీ సరకులు రావడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని వారు ఆరోపించారు. ఈ విషయమై మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. అనంతరం డీఎస్పీ విచారించి రోడ్డు సమస్యను పరిష్కరిస్తారని పంచాయతీరాజ్ ఎస్ఈ మధుసూదన్‌రెడ్డితో మాట్లాడడం జరిగింది. వారు స్పందించిన రేపు రోడ్డు పనులు ప్రారంభం చేస్తామని డీఎస్పీకి హామీ ఇవ్వడంతో పంచాయతీ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిరుగురాజుపాళెం, తడుకు గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా ఎండీ కుమార్ పుట్టిన రోజు వేడుకలు



నాగలాపురం, మే 25 ప్రభాతవార్త:
తిరుపతి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.డి.కుమార్ పుట్టిన రోజు వేడుకను తిరుపతిలోని కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పాల్గొని ఎం.డి. కుమార్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం ఏఎంసీ చైర్మన్ జాన్సన్, పీఏసీ చైర్మన్ సుబ్రహ్మణ్యంరాజు, రాష్ట్ర మొదలియార్ సంఘ డైరెక్టర్ నమఃశివాయం, నాగలాపురం మాజీ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, నియోజకవర్గ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



**తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి గోవిందరాజస్వామి సింహవాహనంపై అభయహస్తంతో భక్తులను అనుగ్రహించారు. వాహనసేవలో మాడవీధులు భక్తిరసంతో పరవశించాయి.**

# తిరుపతి డివిజన్

## ఊరందూరులో కేంద్ర మంత్రికి ఆతిథ్యం



శ్రీకాళహస్తిరూరల్,మే 25 ప్రభాతవార్త: కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరపు రామమోహన్ నాయుడు కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. బొజ్జల కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన కింజరపు రామమోహన్ నాయుడు సోమవారం ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్న తరువాత ఊరందూరు గ్రామంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి గృహానికి వెళ్ళి, అతిథ్యం ఇచ్చారు.

## మహానాడు విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే



శ్రీకాళహస్తిరూరల్, మే 25 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే మహానాడు వర్చువల్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులకు సూచించారు. సోమవారం ఊరందూరు గ్రామంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ సమావేశంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 27,28న జరుగుతున్న మహానాడుకు సంబంధించి వివరాలు ఎంఎల్‌ఏ తెలిపారు. ఆయన 12 చోట్ల క్లస్టర్ సమావేశాలు నిర్వహించుటకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈసమావేశంలో మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు జడ్‌పిటిసి సుబ్బారెడ్డి, మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, చెలికం పాపిరెడ్డి, కామేష్ యాదవ్, బీమాల భాస్కర్, విజయకుమార్ నాయుడు, కృష్ణయాదవ్, నాగరాజు నాయుడు, సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద వ్యక్తి మృతి!



తొట్టంబేడు మే 25 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలం శివనాథపురం గ్రామానికి చెందిన ఎం.డి. రమేష్ (35) అనుమానాస్పద మృతి చెందినట్లు తొట్టంబేడు ఎస్‌ఐ బి.బాలకృష్ణ పత్రికల వారికి తెలిపారు.కుటుంబ సభ్యుల కథనం ప్రకారం రమేష్‌కు మద్యపానం అలవాటు ఉండగా ఆదివారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి ఎంజీఎం ఆసుపత్రి వద్ద చివరగా కనిపించి, తరువాత అక్కడి నుండి వెళ్ళి రాత్రి అపస్మారక స్థితిలో ఉండగా అంబులెన్స్ ద్వారా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం ఇంటికి తీసుకొని రాగా రాత్రి రమేష్ మృతి చెందాడు. రమేష్‌ను ఎవరు ఆసుపత్రికి తరలించారు. మరణానికి గల అసలు కారణం ఏమిటన్న దానిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ బి. బాలకృష్ణ తెలిపారు .

## కుప్పాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా చేయడమే లక్ష్యం

**- ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం, మే 25 ప్రభాతవార్త : కుప్పం ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా చేయడమే ధ్యేయంగా సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారని ప్రభుత్వవిప్, కడ పిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం వెందుగంపల్లిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అధ్వర్యంలో నూతనంగా ఏర్పాటైన రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్‌ను ప్రభుత్వవిప్,కడ పిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్,కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పంను ఆవిష్కరణల కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీంతో పాటు కుప్పం ప్రాంత ప్రజలు ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పొందేలా చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే 7224కోట్లతో కుప్పంలో భారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు. మరిన్ని పరిశ్రమలు సైతం రానున్నాయన్నారు. యువత ప్రభుత్వం అందించే సహకారంతో తమ జీవితాల్లో స్థిరపడేందుకు కృషి చేయాలని సూచించారు. స్మార్ట్ విలేజ్ సెంటర్‌లో యువతకు పరిశ్రమల ఏర్పాటుపై తగు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పంలో ఇప్పటికే ఫ్రంటైయర్ మార్కెట్స్, ఈజిమార్ట్, చాయ్‌రాస్తా సంస్థల సహకారంతో 8వేలమందికిపైగా మహిళలు పారిశ్రామికవేత్తలుగా తమ స్వంత వ్యాపారాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. ఆర్‌టిఐహెచ్ ద్వారా మరింత మందియువత, మహిళలు వ్యాపార రంగంలో అడుగుపెట్టేందుకు అవకాశాలు పెరుగుతాయన్నారు. వ్యాపారం ప్రారంభించాలనేకునేవారికి ప్రణాళిక, బ్యాంకు రుణాలు, శిక్షణ, మార్కెటింగ్‌సహకారం,వ్యాపార విస్తరణతో పాటు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కడ సభ్యుడు రామచంద్ర, కార్పోరేషన్ డైరెక్టర్ పార్థసారథి, కాణిపాకం బోర్డు సభ్యులు వసంతమ్మ, నరేష్, పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పాతపేట ఫీల్డ్ అసిస్టెంట్ బిల్లులు తినేశాడు

**- రూ. 45వేలు స్వాహా - డ్వామా పిడికి గ్రామస్తుల ఫిర్యాదు**



పులిచెర్ల, మే 25 ప్రభాతవార్త: పులిచెర్ల మండలంలోని పాతపేట ఫీల్డ్ అసిస్టెంట్ మునికృష్ణ ఉపాధి హామీ పథకం నిధులు బిల్లులు తినేశాడని గ్రామస్తులు. సోమవారం చిత్తూరులో డ్వామా పిడి రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద గ్రామస్తులు పనులు చేశారు. ఈ పనులకు రావాల్సిన బిల్లులు మునికృష్ణ పనులు చేసిన వారికి ఇవ్వకుండా రూ. 45 వేలు పక్కదారి పట్టించి మింగేసారని గ్రామస్తులు పిడికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన పిడి తక్షణ చర్యలకు ఉపక్రమించారు. పులిచెర్ల మండలం ఉపాధి ఏపీడి శ్రీనివాసులు, ఏపీఓ సౌభాగ్యవతి, ఈసీ కృష్ణయ్య, టెక్నికల్ అసిస్టెంట్ మహేంద్ర, ఎఫ్ఏ మునికృష్ణలను తక్షణం చిత్తూరు డ్వామా కార్యాలయానికి రావాలని ఆదేశించడంతో ఉపాధి అధికారులు సిబ్బంది హుటాహుటిన చిత్తూర్‌కి వెళ్లి పిడిని కలిశారు. ఉపాధి అధికారులపై పిడి తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. మూడు రోజులు లోపల తినేసిన బిల్లులు ఇప్పించాలని లేకపోతే ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. పాతపేట ఫీల్డ్ అసిస్టెంట్ పై. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారులు, కఠిన చర్యలకు, సిద్ధమైనట్లు సమాచారం. గ్రామస్తులకు న్యాయం జరుగుతుందా రాజకీయం నెగ్గుతుందా అని వేచి చూద్దాం.

## వర్చువల్ మహానాడును జయప్రదం చేయండి

**పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు**




పుత్తూరు, మే 25 ప్రభాతవార్త : పుత్తూరు మునిసిపాలిటీలో ఈ నెల 27, 28వ తేదీల్లో జరిగే వర్చువల్ మహానాడులో పార్టీ క్యాడరంతా పాల్గొని జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్‌లు పిలుపిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీరామారావు స్థాపించిన టిడిపి మహానాడు కార్యక్రమం ఈ ఏడాది వినూత్నంగా జరగనున్నదని తెలిపారు. ఇందన పొదుపు చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 1875 క్లస్టర్లలో ఎల్‌ఇడి తెరలను ఏర్పాటు చేసి వర్చువల్‌గా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా మునిసిపాలిటీలోని క్లస్టర్ 3కి సంబంధించి ఒకటి నుంచి 13 వార్డుల వరకూ పున్నమి బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన మహానాడు ప్రాంగణం వద్ద, క్లస్టర్ 4కు సంబంధించి 14 నుంచి 27 వార్డుల వరకూ మునిసిపాలిటీలోని కల్యాణపురం వద్ద ఎఎండి ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న వర్చువల్ మహానాడులలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్క టిడిపి నాయకుడు, కార్యకర్త పసుపు చొక్కా ధరించి పార్టీ గుర్తింపు కార్డుతో మహానాడు కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## అదుపులేని ఆటోలు... క్షణ క్షణ ప్రయాణం ప్రమాదకరం

**-దిష్టి బొమ్మల్లా ట్రాఫిక్ హోంగార్డులు, కానిస్టేబుళ్ళు**



బస్సుకు అడ్డంగా ఆటో నిలిపివేసిన దృశ్యం

శ్రీకాళహస్తి మే 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని ఆటోల సంఖ్య వేలల్లో పట్టణ జనాభా మించి ఉన్నాయి. పట్టణంలో ఆటోల పరిస్థితి అగమ్యగోచరంగా మారి, ఆటోలు నడుపుతున్నవారిలో ఎక్కువ మందికి లైసెన్సులుండటం లేదు. పైగా చాలా మందికి ట్రాఫిక్‌పై అవగాహన లేక, పట్టణంలో రద్దీ సమయంలో యూ టర్న్ తీసుకోవటం ఇష్టారాజ్యంగా నడపటం జరుగుతుంది. దాంతో రోడ్లపై పయనమే గగనంగా మారి, ఆటోల ఆగడాలు రోజురోజుకీ శృతిమించి పోతున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మరి వయోవృద్ధులు బజారు రోడ్లపైకి రావాలంటేనే బయపడే పరిస్థితి ఏర్పడుతున్నది. అధిక సంఖ్యలో ఖాళీ ఆటోలే దర్శనమిస్తుంటాయి. పట్టణంలో ఆటో డ్రైవర్లు మద్యం సేవించి ఆటోలను నడపడమే కాకుండా, ఎలా పడితే అలా ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఆటో డ్రైవర్లను పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిని పరిశీలిస్తే కొంతవరకు ప్రమాదాలను అరికట్టువచ్చునని స్థానికులు వాపోతున్నారు. ట్రాఫిక్ కానిస్టేబుళ్ళును, కొన్ని సంవత్సరాలను పాత ట్రాఫిక్ హోంగార్డులు వుండడం, వారు ఎవరినీ ఏమీ అనలేని పరిస్థితి. యథారాజా తథా ప్రజా లాగా మాకెందుకు వివాదాలు అన్నట్లు ఆ హోంగార్డులు వ్యవహరిస్తుంటారు. ఆటోలు నడపాలంటే నిబంధనలను పాటించాలని పదేపదే ఆర్టీవో చెబుతున్నా, అయితే ఆ దిశగా ఆటోలను ఎందుకు నిలబరించలేకపోతున్నారని ప్రజలు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై ఆటోను అడ్డంగా నిలిపివేయడంతో బస్సులు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని, దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రమాదాలకు అవకాశం పెరుగుతోంది స్థానిక ప్రజలు వాపోతున్నారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ కొంతమంది డ్రైవర్లు రోడ్లపైనే వాహనాలను పార్క్ చేయడం ఆపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పోస్టాఫీస్ ప్రాంతం వద్ద ఎప్పుడూ రద్దీగా ఉండే కారణంగా చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. సంబంధిత ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై అడ్డంగా నిలిపిన వాహనాలపై చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## రాళ్ళు తేలిన అమ్మపాళెం రోడ్డుకు మోక్షం లేదా!

**-సుమారు 20 గ్రామాలకు రహదారి -పట్టించుకోని అధికారులు, వాహన దారుల అవస్థల**



కంకర రాళ్లతో దర్శనమిస్తున్న రోడ్డు

శ్రీకాళహస్తిరూరల్,మే 25 ప్రభాతవార్త : మన నాగరికతకు నిదర్శనం రహదారులంటారు. కానీ నేడు పలు మార్గాల్లోని ప్రధాన రోడ్లు మరమ్మతులకు నోచుకోకుండా అవస్థలు ఎదుర్కొంటున్నారు. గతంలో పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో ఉన్న రోడ్లు నేడు ఆర్‌అండ్‌బిలో కలిపారు. ఈ రోడ్లు వేయకుండానే బిల్లులు దిగమింగగా, కొందరు రోడ్లు వేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండానే ఆయన మృతి చెందారు. అయితే వైపాకా పాలనలో నిర్లక్ష్యానికి గురైన, రోడ్లు బాగు చేయటానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.కోట్లు నిధులు సాధిస్తున్నారు. కానీ శ్రీకాళహస్తికి పొలిమేరల్లోని మిట్టకండ్రిగ నుంచి అమ్మపాళెం వరకు రోడ్డు రాళ్ళు తేలి నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.

**20గ్రామాలకు రహదారి:**

శ్రీకాళహస్తి నుంచి తొండమనాడు మీదుగా పాపానాయుడుపేటకు వెళ్ళు దారి సుమారు 20 గ్రామాలకు రహదారిగా ఉంది. ఇక్కడ రోడ్డు నిర్మాణానికి కంకర తోలారు. పనుల ప్రారంభంలో నిర్లక్ష్యం, వాహన చోదకులకు శాపంగా మారింది. దాంతో ఈ మార్గంలో వెళ్ళాల్సిన వారు చెర్లోపల్లి మీదుగా పయనిస్తున్నా, ఇక ఆర్‌టిసి బస్సులు మాత్రం తప్పదన్నట్లు వెళ్ళుతున్నారు. ఇదే మార్గంలో టీటీడీ అనుబంధాలయమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం, బొక్కసంపాలెం వద్ద శ్రీకాళహస్తీశ్వరాలయం అనుబంధాలయమైన కోదండ రామేశ్వర స్వామి ఆలయాలున్నాయి. ప్రతినిత్యం ప్రజలు, భక్తులతో వాహనాలు రాకపోకలు ప్రతినిత్యం సుమారు పదుల సంఖ్యలో వాహనాలకు పంచర్లుతో, నిత్యం కష్టాల పయనంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.ఈ రోడ్డుకు సంబంధించి సంబంధిత అధికారి దుర్గేష్‌ను వివరణ కోరగా, బిటి రోడ్డు వేయాల్సి ఉందని అందుకుకంకర తోలామని త్వరలోనే చేపడతామని వివరణ ఇచ్చారు.

## మద్యం షాపుల్లో...బ్రాండెడ్ బీర్లు మాయం

శ్రీకాళహస్తి/ తొట్టంబేడు/ ఏర్పేడు మే 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మద్యం షాపుల్లో బ్రాండెడ్ బీర్లు మాయం చేస్తున్నట్లు మందుబాబులు వాపోతున్నారు. బీరు బ్రాండ్ అయినా కింగ్ ఫిషర్ స్ట్రాంగ్, కింగ్‌ఫిషర్ అల్ట్రా, కింగ్ ఫిషర్ స్ట్రామ్ వంటి బీర్లు బెల్ట్ షాపులోకి వెళ్తున్నాయని మద్యం షాపుల్లో విక్రయాలు జరపడం లేదని మందుబాబులు వాపోతు న్నారు. కారణమేంటంటే వీటి ధర 200 రూపాయలు మాత్రమే. బీరు బ్రాండ్లు ఆయన బట్ వైజర్, బట్ వైజర్ మాగ్నమ్ వంటి బీర్లు మాత్రమే లభ్యమవుతున్నాయని వీటి ధర 300 రూపాయలుగా ప్రభుత్వ నిర్ణయించింది. గత ప్రభుత్వంలో జే బ్రాండ్లు ఇంకా ఈ ప్రభుత్వంలో కూడా రాజ్యంవెళ్తున్నాయన్నారు. బ్రిటిష్ ఎంపైర్ బీర్ గత ప్రభుత్వంలో అమ్మకాలు జరిగేవి. కూటమి ప్రభుత్వంలో జే బ్రాండ్లకు తావు లేదని చెప్పుకుంటున్న ప్రభుత్వం మద్యం షాపుల్లో ఇదే బిర్లను అమ్మకాలు జరుపుతున్నట్లు మందుబాబులు వాపోతున్నారు. గత ప్రభుత్వం ఏర్పడక ముందు మద్యం షాపుల్లో నాకౌట్ , హే వార్డ్స్ 5000, టుబర్గ్, కాల్స్‌బర్గ్ వంటి నాణ్యమైన అంతర్జాతీయ బీర్లు లభించేవి. ప్రస్తుత ప్రభుత్వంలో ఇవేవీ కాన రావడంలేదని కొత్త బ్రాండ్లు స్టెరాన్,బ్రిటిష్ ఎంపైర్ బీర్లు లభ్యమోతుండడంతో మందుబాబుల జేబులకు చిల్లు పడుతుంది. ఈ బ్రాండ్లపై నాణ్యత పై మందుబాబులు తమ ఫిర్యాదులను ఎవరికి తెలిపాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారు. గత ప్రభుత్వంలో మద్యం రేట్లు భారీగా పెంచారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కొన్ని రకాల రేట్లు కొంతవరకు మాత్రమే తగ్గించారని ఇప్పటికి కూడాపోరుగురాష్ట్రంలో కంటే ఆంధ్రప్రదేశ్లోని రేట్లు ఎక్కువ ఉన్నాయని మందుబాబులు వాపోతున్నారు. నాణ్యమైన బ్రాండ్లు టూ బర్గ్ కాల్స్ బర్గ్ హవార్డ్స్ 5000 నాకౌట్ వంటి బీర్ల పై ప్రభుత్వం దృష్టి సారిస్తే బాగుంటుందని మందుబాబులు వాపోతున్నారు. శ్రీకాళహస్తి ఏర్పేడు తొట్టంబేడు బుచ్చినాయుడు కండ్రిగ వైన్ షాపుల్లో చల్లని బీర్లు మద్యం బాటల్లో మాయం అదే బీరు బాటల్లో చౌక్ మద్యం బెల్ట్ షాపుల్లో దొరుకుతున్నాయని బెల్ట్ షాపుల్లో బాటల మీద 50 రూపాయల నుంచి 100 రూపాయల వరకు తెచ్చిపెట్టి దోచుకుంటున్నారని ఇదేమిటని స్థానికులు యాజమాన్యాన్ని అడిగితే మాకు సంబంధం లేదు మా పై వారు అడగండి లేదా వారిపై వారిని అడగండి అంటూ ఒకరిపై ఒకరు చాడీలు చెప్పడం జరుగుతుందని మందుబాబులు వాపోతున్నారు. ఇలా స్థానిక ప్రజలకు చౌక ధరలకు దొరకని మద్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు సంబంధించిన అధికారులుమద్యం దుకాణల పై విచారణ జరిపి మద్యం షాప్‌కి రావాల్సిన మద్యం పక్క దారి ఏర్పడకుండా శ్రద్ధచూపాలన్నారు.దీనిపై ఉన్నత స్థాయి అధికారులు సంబంధిత అధికారులతో చర్చించి విషయంపై నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా స్థానిక ప్రజలకు అందుబాటులోకి చౌక ధరలకే మద్యం తీసుకురావాలని స్థానికులు ఉన్నత స్థాయి అధికారులను కోరుతున్నారు.



## సర్వర్ల మోరాయించడంతో...సామాన్యభక్తుల సంకటం



శ్రీకాళహస్తి,మే 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తులు కదం తొక్కారు. వరుస సెలవులతో మూడు రోజులుగా భక్తుల తాకిడితో పాటు అతిథుల తాకిడి కూడా పెరిగింది. సాధారణంగానే సోమవారం ఉదయం రాహుకాల సమయంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించు కొనుటకు భక్తులు కదం తొక్కుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఆలయం వద్ద భక్తులు తండోపతండాలుగా హాజరయ్యారు. ఉదయం ఆన్‌లైన్‌లో సర్వర్లు మొరాయించాయి, దాంతో సామాన్యభక్తుల పరిస్థితి సంకటంగా మారింది. ఒకదశలో భక్తులు సంయమనం కోల్పాయారు. ఇదేమి చొద్యమంటూ తిరగబడ్డారు, దాంతో సరిస్థితిని అవగాహన చేసుకున్న ఇఓ బికె వెంకటేశులు, సిబ్బంది స్పందించారు. వెంటనే భక్తులు ఇబ్బంది పడకుండా ఆఫ్‌లైన్‌లో అనుమతించారు. శ్రీకాళహస్తీశ్వరాలయా నికి వచ్చే భక్తులకు మూడు రోజుల నుంచి ఆన్‌లైన్ బాధలు తప్పటం లేదు. ప్రతి రోజూ సర్వర్లు మొరాయించటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. గతంలో కూడా ఆన్,ఆఫ్‌లైన్లు ఉన్నాయి, ఆన్‌లైన్‌లో మంజూరుకాని వారికి ఆఫ్‌లైన్లో అవకాశం కల్పిస్తున్నారు. కానీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ చేయటంతో భక్తులకు సర్వర్లు పని చేయకపోవటంతో తిప్పలు మొదలయ్యాయి. ఆలయాధికారులు, సిబ్బందికి అవస్థలు మొదలయ్యాయి. వరుస సెలవులతో శ్రీకాళహస్తీశ్వ రాలయం కిట కిట లాడుతుంది. ఓ వైపు రాహుకేతుదోష నివారణ పూజలు, మరో వైపు అభిషేకాలకు భక్తులు తిప్పలు పడుతున్నారు. ఆన్‌లైన్‌సేవలతో దళారులకు చెక్‌పెట్టాలని భావిస్తే సర్వర్లు మొరాయిస్తుండటంతో నిత్యం భక్తుల తిరుగుబాటును అధికారులు ఎదుర్కొక తప్పటం లేదు. రాహుకాలంలో ఆలయాధికారులు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నా ఆచరణలో సర్వర్ల మొరాయింపుతో ఇబ్బందులు ఎదుర్కొలేక పోతున్నారు. సంస్కరణలపై భక్తులకు పూర్తి స్థాయి అవగాహన వచ్చే వరకు అవకాశం కల్పించి ఉండాలి. ఈ అంశానికి సంబంధించి దేవాదాయశాఖ పురాలోచించి దశల వారిగా భక్తులకు సమగ్ర అవగాహన కల్పించి ఆమలు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం సర్వత్రా వెల్లడౌతుంది.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



శ్రీకాళహస్తి,మే 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరివిగా విరాళాలు అందుతున్నాయి. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి అన్నమయ్య జిల్లా బొజ్జగుంట పల్లికి చెందిన పొత్తూరి నవీన్‌కుమార్ దీప్తి దంపతులు నిత్యాన్నదాన పథకానికి ఎఇఓ మోహన్‌కు రూ.లక్ష విరాళాన్ని అందించారు. ఏర్పాట్లును ఎఇఓ ఆదేశాలతో ఎపిఆర్‌ఓ రవి పర్యవేక్షించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## పరశురామేశ్వరాలయంలో అన్నదానం



ఏర్పేడు,మే 25 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో సోమవారం అన్నదానం జరిపారు. ఇక్కడకు సోమవారం విశేష సంఖ్యలో భక్తులు హజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు, ఇఓ మునిశేఖర్ సారధ్యంలో వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా అన్నదానం ఏర్పాటు చేసారు. సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేకాలంకారం నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసిన నిర్వాహకులకు భక్తులు ధన్యవాదాలు తెలిపారు.

## వేదపండితులకు టేకు పీటలు బహూకరణ



శ్రీకాళహస్తి,మే 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేదం పఠించే వేదపండితులు, రుద్రాభిషేకం నిర్వహించు అభిషేక గురుకుల్‌లకు విజయఎాడకు చెందిన సామిల్లు యజమానులు టేకు పీఠాలను విరాళంగా అందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో రుద్రాభిషేకం సంకల్పం చేయుటకు అభిషేక గురుకుల్ కూర్చొని సంకల్పం చేస్తారు. వారికి కూర్చొటానికి రూ.1.5లక్షల విలువ కల్గిన ంరెండు పీటలను ప్రత్యేకంగా తయారి చేసి బహూకరించారు. విజయవాడకు చెందిన సామిల్లుల యజమానులు బైరబోయిన శ్రీనివాసరావు పద్మావతి దంపతులు,వెంగమాంబ టింబర్ డిపో మరియు సామిల్లు యజమానులు ప్రత్యేకంగా తయారు చేసిన పీటలను అందించారు.వీటిని ఆలయ ఇఓ బికె వవెంకటేశులు ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, అభిషేక గురుకుల్ వరదా గురుకుల్, ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి,ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డిఇఇ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు సురేష్‌గురుకుల్, అసిస్టెంట్ స్థపతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సోంత లాభం కోసం బంకును తొలగింపు!



ఏర్పేడు మే, 25 ప్రభాతవార్త : ఏర్పేడు మండలం వెంకటగిరి రోడ్డు ఆమందూరు పంచాయతీ పరిధిలో గత 20 సంవత్సరాలకు పైగా పంచాయతీ స్థలంలో ఉన్న బంకులు వున్నాయి. బాధితురాలు అయిన సరస్వతమ్మ అనే వృద్ధురాలిపై ప్రక్కన ఉన్న సిమెంట్ వ్యాపారి రామ్మోహన్ రెడ్డి దాడి చేసి బెదిరించి, తమ బంకును పగలకొట్టి నష్టం కలిగించడం చాలా బాధాకరం అని బాధితురాలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బాధితురాలు మాట్లాడుతూ నాకు ఎలాంటి సమాచారం లేకుండా ఎలాంటి సంబంధిత అధికారులు లేకుండా తన సొంత లాభం కోసం నష్ట పరిచారని ఏర్పేడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

## బేటి బచావో...బేటి పడావోపై అవగాహన



తొట్టంబేడు మే 25 ప్రభాతవార్త : బాల్య వివాహాలు బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమాలపై ఐసిడిఎస్ సూపర్వైజర్ మారియమ్మ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సోమవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శ్రీకాళహస్తి ఐసిడిఎస్ సిడిపిఓ శాంతి దుర్గ ఆదేశాల మేరకు ఐసిడిఎస్ సూపర్వైజర్ మారియమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, తల్లి బిడ్డల సంరక్షణ, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.పోక్సో, నిర్భయ చట్టాలు, మద్యపానం, ధూమపానం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం నరసింహులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.